
SUNRISE EDUCATIONAL HUB
FIRST TIME IN ADILABAD HISTORY
SUNRISE SPECIAL FEATURES

www.jananinadam.com

Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

## ఆర్టీసీ బస్సు బోల్తా: ఒకరు మృతి

జననినాదం,ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,మే1: ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జాతీయ రహదారిపై ఆటోను ఢీకొట్టి ఆర్టిసి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారు. పశువులను తప్పించబోయి ఆటోను ఢీకొని బస్సు బోల్తా పడింది. గాయపడిన వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో నాలుగు పశువులు కూడా మృత్యువాతపడ్డాయి.

సంపుటి: 1 సంచిక: 276 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | శుక్రవారం 02-05- 2025 | ➤ పేజీలు : 8 | ➤ వెల : రూ.2.00



## వేవ్స్ సమ్మిట్ ను ప్రారంభించిన ప్రధాని మోదీ

2వ పేజీలో...

- హాజరైన సినీ ప్రముఖులు
- ముంబై వేదికగా నాలుగు రోజుల పాటు సదస్సు
- వరల్డ్ ఆడియో,విజువల్ , ఎంటర్ టైన్మెంట్ గా సమావేశాలు


ముంబై : వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ -వేవ్స్ ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ మీడియా పవర్ హౌస్‌గా భారత దేశాన్ని సమున్నతంగా నిలిపేందుకు భారత ప్రభుత్వం 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తోంది..



## కులగణనలో తెలంగాణ రోల్ మాడల్

- మా అనుభవాన్ని ఉపయోగించుకోండి
- మేం అనేక రకాలుగా కసరత్తు చేసి అనుభవం పొందాం
- రాహుల్ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదు
- రాష్ట్రం యూనిట్‌గా కులగణన చేపట్టాలి
- పలు రకాల కమిటీలు వేసి స్పష్టంగా ముందుకు వెళ్లాలి
- ఏడాది కాలపరిమితిలో గణనను పూర్తి చేయాలి
- మీడియా సమావేశంలో కేంద్రానికి సీఎం రేవంత్ సూచనలు

హైదరాబాద్, : కులగణనలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, రాహుల్ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ మార్గనిర్దేశర ప్రకారం, తెలంగాణలో కుల గణనను సక్రమంగా నిర్వహించి, దేశానికి ఒక మోడల్‌గా నిలిపింది. గురువారం సిఎం మీడియాతో మాట్లాడారు. కేశవరావు, మధుయాష్కీలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని యూనిట్‌గా కుల గణన చేయడం అత్యంత అవసరం అని చెప్పారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం, వర్గం ఉందని ఆయన వివరించారు. ఆయన చేసిన సర్వే 8 పేజీల ప్రశ్నావళి ద్వారా రూపొందిం చబడింది. ఈ సర్వేలో ప్రైవసీ యాక్ట్‌ను కూడా అనుసరించామని, 95 వేల మంది ఎన్యూమరేటర్లను నియమించి, సర్వే మానిటరింగ్ కోసం సూపర్ వైజర్లు నియమించామని తెలిపారు. సర్వేలో 3 శాతం మంది పాల్గొనకపోవడం వల్ల తిరిగి వారికి అవకాశం ఇచ్చామనీ, తెలంగాణ మోడల్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.



2వ పేజీలో...

## జెరూసలెం శివారు అడవుల్లో భారీ కార్చిచ్చు బీభత్సం

### ప్రజలు అప్రమత్తంగా ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ హెచ్చరిక

జెరూసలెం : ఇజ్రాయెల్‌లో జెరూసలెం శిరవారుల్లోని అడవుల్లో భారీ కార్చిచ్చు సంభవించింది. పొడి వాతా వరణం, గాలులతో మంటలు వేగంగా వ్యాపిస్తుడటం తో దాదాపు 3,000 ఎకరాల అడవులు తగలబడ్డా యి. జెరూసలెం నుంచి తెల్ అవీవ్ ప్రధాన రహదారి వరకు మంటలు వ్యాపించటంతో ఆ దారులన్నీ అధికారులు మూసేశారు. అలాగే, వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



2వ పేజీలో...


## రష్యా, ఉత్తర కొరియాల మధ్య ప్రారంభమైన మొదటి రోడ్ లింక్



## ఇది నరేంద్రమోదీ ప్రభుత్వం.. ఎవరినీ వదిలిపెట్టదు

- ఉగ్రవాదంపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కఠిన హెచ్చరిక

ఢిల్లీ,:"పిరికితనంతో చాటుగా వచ్చి దాడి చేసి ఇది తమ గొప్ప విజయ మని ఎవరైనా భావిస్తే ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఎవరినీ విడిచిపెట్టదు" అని కేంద్ర హెూంశాఖ మంత్రి అమి త్ షా హెచ్చరించారు. ఉగ్రవాదంపై పోరాటంలో కేవలం 140 కోట్ల మం ది భారతీయులే కాకుండా యావత్ ప్రపంచం భారత్‌కు అండగా నిలు స్తోందని పేర్కొన్నారు. "ప్రపంచం లోని అన్ని దేశాలు సంఘటితంగా ఈ పోరాటంలో భారత ప్రజలతో నిలబడుతున్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించే వరకు తమ పోరాటం ఆగదని అమిత్ షా పునరుద్ఘాటించారు. "ఈ దుశ్చర్యలకు పాల్పడిన వారికి కచ్చితంగా తగిన శిక్ష లభిస్తుంది" అని ఆయన హెచ్చరించారు.



2వ పేజీలో...

## పహల్గామ్ ఉగ్రదాడిపై పిల్.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- పహల్గామ్ ఉగ్రదాడిపై న్యాయ విచారణ కోరిన పిటిషన్ తిరస్కరణ
- ఇది అత్యంత క్లిష్ట సమయం, ఇలాంటి వ్యాజ్యాలు తగవని కోర్టు వ్యాఖ్య
- భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీసే చర్యలు వద్దని పిటిషనర్‌కు హితవు
- ఉగ్రవాద ఘటనల విచారణకు న్యాయమూర్తులు నిపుణులు కారని స్పష్టీకరణ
- కోర్టు సూచనతో వ్యాజ్యాన్ని వెనక్కితీసుకున్న పిటిషనర్




## ఆపరేషన్ లోకల్ లో కమలం

2వ పేజీలో...


### అధికారం దిశగా సరికొత్త వ్యూహాలకు పదును

హైదరాబాద్,: రాజకీయాల్లో ఇప్పటి వరకూ ఓ లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క అంటోంది బీజేపీ. లెక్కలు మారబోతున్నా యని ప్రత్యర్థులకు హెచ్చరిక సైరన్ చేస్తోంది. అధికారం దిశ గా సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుదాం అంటోంది బిజెపి అదిష్టానం. కేవలం మాటలు మాత్రమే కాదు, ఇప్పటికే ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు సంకేతా లందుతున్నాయి.తెలంగాణలో గతంతో పోల్చితే బిజెపి బాగా బలపడింది. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ తరువాత తామే అంటూ ఆ పార్టీ నేతలు మాంచి జోష్ మీదున్నారు. ప్రభుత్వంపై విమర్శలు, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నిలలో మతం కార్డు ప్రయోగించడం అందులో భాగమే అంటున్నారు.



## మహిళల ఆర్థిక స్థిరత్వమే.. ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఇచ్చిన ప్రతి హామీ ని నెరవేరుస్తాం
- రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- పట్టణంలో 410 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని ప్రతినిధి, మే 01: మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.

2వ పేజీలో...

# ఆపరేషన్ లోకల్ లో కమలం



ఇలా రాష్ట్ర రాజకీయాల్లో బిజెపి నేతలు జోరు పెంచుతున్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి అధికారం కోసం ఉవ్విల్లూరుతున్న బిజెపి అధిష్టానానికి మాత్రం ఆ కల నెరవేరడం లేదు. కలగానే మిగులుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత నుంచి బిజెపి లెక్క మారింది. అదృష్టం జస్ట్ ఒక్క అడుగు దూరంలోనే ఉందని నాయకత్వం నమ్ముతోంది. తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయం, ఈసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యం అనే ధీమాలో ఉన్నారు బిజెపి నేతలు. ఈసారి కేవలం మాటలు చెప్పడం కాదు, చేతల్లో చూపించాలని అధిష్టానం సీరియస్‌గా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు చాలా టైం ఉంది, ఇప్పుడే ఎందుకంత తొందర అనుకుని వదిలేస్తే కుదరదు. ఇప్పటి నుంచి జనంలోకి వెళ్లాలి. పార్టీ క్యాడర్‌ను మరింత బలోపేతం చేసుకోవాలి. బలం, బలగం చేజారకుండా చేయడంతోపాటు బలహీనతలపై అందకంటే ఎక్కువ శ్రద్ధపెట్టాలని కేంద్ర పెద్దలు భావించారు. అందుకే తెలంగాణలో ఇప్పటి నుంచే ఆపరేషన్ లోకల్ మొదలు పెట్టాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. ఈ ఆపరేషన్ లోకల్‌లో భాగంగా తెలంగాణలోని జిల్లాల వారీగా పార్టీ బలాలు,

మొదటిపేజీ తరువాయి...

బలహీనతలు గుర్తించే బాధ్యతను కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అప్పగించినట్లుగా సమాచారం. ముఖ్యంగా ఖమ్మం,వరంగల్ , నల్గండ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఫిక్సయ్యారట కేంద్రపెద్దలు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ జిల్లాలోనే పార్టీ బలహీనంగా ఉందని రాష్ట్ర నాయకత్వంతోపాటు, కేంద్రం సైతం ఓ క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మూడు జిల్లాల్లో పార్టీ బలాలు ,బలహీనతలు వెంటనే గుర్తించాలి. స్థానిక సమస్యలపై పోరాటం చేసేందుకు కార్యచరణ రూపొందించాలి. ఇతర పార్టీల నుంచి సమర్థులైన నాయకులను ఆకర్షించాలి. పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని కదిలించేలా నిరసనలు, ఆందోళనలు చేసేందుకు బిజెపి నేతలు సిద్దమైనట్లు తెలుస్తోంది. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల?లో ఇప్పటికే ఏర్పడ్డ బూత్ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా కమిటీల ఎన్నికపై మరోసారి క్రాస్ చెక్ చేసేందుకు ఇన్ ఛార్జ్ లను అధిష్టానం నియమించినట్లు తెలుస్తోంది. క్యాడర్‌ను ఉత్తేజపరిచే కార్యక్రమాలతోపాటు, ఆర్ ఎస్ ఎస్, విహెచ్పీ వంటి సంఘ్ పరివార్ సంస్థలతో కలసి ప్రజాసమస్యలపై పోరాటం చేయడం ద్వారా లోకల్ గా ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. ఇలా ఓ వైపు ఈ జిల్లాలో నిర్మాణాత్మకంగా కార్యకర్తలను తయారు చేసుకోవడంతోపాటు, ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలపై జనాన్ని సంఘటితం చేయడం, వారికి మద్దతుగా పోరాడుతూ బిజేపీ అంటే లోకల్, లోకల్ అంటే బిజెపి అనేలా ఇప్పటి నుంచి ప్రజలకు మరింత దగ్గరవ్వాలని భావిస్తోంది. ఇలా ఆపరేషన్ లోకల్ పై దృష్టిపెట్టడం ద్వారా అధికారం చేతి నుంచి కమలం వశం చేసుకొచ్చనే మాస్టర్ ప్లాన్‌తో తెలంగాణలో బీజెపి వ్యూహాత్మకంగా దూసుకోపోతోంది.

# కులగణనలో తెలంగాణ రోల్ మాడల్

మొదటిపేజీ తరువాయి...

ఈ మేరకు కేంద్రమంత్రి మోడీకి రేవంత్ రెడ్డి సలహా ఇస్తూ...కేబినెట్ మంత్రులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, టర్మ్ ఆఫ్ రిఫరెన్స్‌ను రూపొందించండని ఆయన పేర్కొన్నారు. అలాగే, కుల గణనను సమాజానికి ఎక్స్-రే లాంటిదిగా భావించారు, దీనికి సంబంధించిన ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ సూచించారు. మేము 57 ప్రశ్నలు 8 పేజీల ప్రశ్నావళిలో రూపొందించాం. ప్రజల సమాచారాన్ని గోప్యంగా ఉంచాము. కేవలం ఆయా కులాల పర్సంటేజ్ మాత్రమే ఇచ్చామని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం దీనికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, కుల గణనకు ముందు వచ్చిన కేంద్రానికి అభినందనలు తెలిపారు. జనగణనతో పాటు- కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కేంద్రం నిర్ణయంపై రాజకీయాలు మాట్లాడదల్చుకోలేదని వెల్లడించారు. కుల గణనపై తెలంగాణ రాష్ట్రానికి అవగాహన ఉందన్నారు. కుల గణన కోసం దేశ వ్యాప్తంగా ఒక కమిటీ- ఏర్పాటు- చేయాలన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం ఒక్కో జాబితాలో ఉందని తెలిపారు. కుల గణన కోసం మంత్రులతో ఒక కమిటీ ఏర్పడి చేయాలని.. అధికారులతో, నిపుణులతో ఒక కమిటీ వేసి అధ్యయనం చేయాలని సూచించారు. కులగణన కోసం తెలంగాణ మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్రానికి తెలిపారు. మంత్రుల కమిటీ- వెంటనే నియమించాలన్నారు. మంత్రుల కమిటీకి తోడుగా నిపుణుల కమిటీని వేయాలన్నారు. ఈ రెండు కమిటీలతో దేశవ్యాప్తంగా అధ్యయనం చేయించాలని తెలిపారు. అలాగే ఈ వ్యవహారమంతా ఏడాదిలోగా పూర్తి చేయించాలన్నారు. తాము ప్రజల నుంచి, ప్రజా సంఘాల నుంచి అనేక విషయాలు, సూచనలు తీసుకొని కులగణన చేశామన్నారు. కుల గణన కోసం 95,000 ఎన్యూమరేటర్లను నియమించామని.. పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించినట్లు- చెప్పారు. మంత్రుల కమిటీ- ఎప్పటికప్పుడు పర్యవేక్షించిందన్నారు. కుల గణన చేసిన తర్వాత పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని.. కుల గణనలో పాల్గొనని వాళ్ళకి మరోసారి అవకాశం ఇచ్చామన్నారు. మూడు నెలల్లోనే ఎలాంటి ఇబ్బందులు రాకుండా కుల గణన చేశామని తెలిపారు. కుల గణన విషయంలో కేంద్రంతో కలిసి నడవడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కుల గణన విషయంలో కేంద్రానికి వచ్చే సందేహాలకు సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధంగా



ఉన్నట్లు- తెలిపారు. 1931 తర్వాత కుల గణన చేసింది తెలంగాణ ప్రభుత్వమే అని అన్నారు. కుల గణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి అన్ని రకాలుగా మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. కుల గణన ఎప్పుడూ మొదలు పెడతారో మోదీ చెప్పాలన్నారు. ఎప్పటి లోగా కుల గణన చేస్తారని ప్రశ్నించారు. కుల గణన సీక్రెట్ డాక్యుమెంట్ కాదని.. కుల గణన విధివిధానాలు బయట పెట్టాలన్నారు. 50 శాతం పరిధి పెంచి రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు పెట్టి ఆమోదించామన్నారు. తెలంగాణ బలహీన వర్గాల తరఫున రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలియజేశారు. రాహుల్ సూచనల మేరకు కుల గణన నిర్వహించామని.. కుల గణన క్రెడిట్ రాహుల్ గాంధీదే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. తాము కులగణనపై దేశానికి మార్గదర్శకంగా నిలిచామని స్పష్టం చేశారు. దేశంలోని అనేక పార్టీలు కులగణన కోరుతున్నాయని, కులగణన చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయని అన్నారు. తెలంగాణలో బీసీలుగా ఉన్న బోయలు.. కర్ణాటకలో మరో వర్గంలో ఉన్నారు. రాష్ట్రంలో 8వేల పేజీల్లో 57 ప్రశ్నల ద్వారా మేం వివరాలు సేకరించాం. కులగణన విషయంలో తెలంగాణ అనుభవం కేంద్రానికి ఉపయోగపడుతుంది. ఎన్యూమరేటర్ నుంచి సీఎస్ వరకు పలుమార్లు సమీక్ష నిర్వహించాం. అనేక సలహాలు, సూచనలు వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్ ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించాం. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కులగణన చేపట్టాం. తెలంగాణ మోడల్ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం. అన్ని రాష్ట్రాలకు నిపుణుల కమిటీని పంపాలి. ప్రతి రాష్ట్రంతో మాట్లాడి ఆయా ప్రభుత్వాల సూచనలు తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. కులగణన పూర్తయ్యాక ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలని కేంద్ర ప్రభుత్వానికి రేవంత్ సూచించారు.

# మహిళల ఆర్థిక స్థిరత్వమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి...

గురువారం మంత్రి శ్రీధర్ బాబు మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సైతం పాల్గొన్నారు. మంథని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీపాద కుట్టు మిషన్ కేంద్రం, ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన 2.5 లక్షల విలువ గల మొబైల్ క్యాంటీన్, మార్కెట్ ఏరియాలో 5 లక్షల విలువగల నైనిక నైటీస్ ఫ్యాషన్ వేర్ మ్యాచింగ్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు. పాత పాల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలం పరిశీలించారు. మొబైల్ క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి అధికారులతో కలిసి టిఫిన్ చేసి చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలచే కుట్టు మిషన్ కేంద్రాలు, మొబైల్ క్యాంటీన్, వివిధ వ్యాపార యూనిట్ల స్థాపనకు కృషి చేస్తున్నామని అన్నారు. మంథని పట్టణంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి శ్రీపాద కుట్టు మిషన్ కేంద్రం ద్వారా 10 మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించాలని ప్రయత్నంతో మంథని లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మహిళ సోదరీమణులు వ్యాపార విస్తరణలో ఎటువంటి కార్యాచరణ తీసుకున్న ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించామని, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా అనేక మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని, ప్రయాణాలు చేస్తూ



వాణిజ్య వ్యాపార రంగాలలో ఎదిగేందుకు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని మంత్రి తెలిపారు. మంథని పట్టణంలో ఇండ్లు లేని నిరుపేదలకు మొదటి జాబితాలో 410 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, ఇండ్ల స్థలం లేని వారికి కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వ స్థలం గుర్తించే కార్యక్రమం కలెక్టర్, ఆర్డిఓ ఆధ్వర్యంలో జరుగుతుందని అన్నారు. ప్రజలు ఓపికతో ఉండాలని ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద క్యాంటీన్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి వివిధ అంశాలలో మహిళలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమార స్వామి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పాతపద్ధతిలో విఐపి బ్రేక దర్శనాలు



తిరుమల,మే1 : తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కొత్త షెడ్యూల్ గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 5.30 గంటలకు మొదలై ఉదయం 11 గంటలకు ముగి సేవి. అయితే రాత్రి వేళల్లో కంపార్టుమెంట్లలో వేచి ఉండే భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఉదయం 10 గంటలకు మార్చారు. అయినప్పటికీ జనరల్ బ్రేక్ దర్శన భక్తులకు మాత్రం ఉదయం 8 గంటల నుంచి 10 గంటలోపు దర్శనం చేయిస్తున్నారు. ఇక, రెండవ నైవేద్యం గంట.. అంటే ఉదయం 10 గంటల తర్వాత ప్రొటోకాల్, రెఫరల్, శ్రీవాణి, ఉద్యోగులకు దర్శనం చేయిస్తున్నారు. దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ బ్రేక్ దర్శనాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన ధర్మకర్తల మండలి తిరిగి బ్రేక్ దర్శనాల్లో పూర్వపు విధానాన్ని అమలుచేయాలని తీర్మానించింది. ఇందులో భాగంగా గురువారం నుంచి తిరిగి పాత పద్ధతిలో బ్రేక్ దర్శనాలను ప్రవేశపెట్టేందుకు టీటీడీ సిద్ధమైంది. ప్రొటోకాల్, రిఫరెల్, జనరల్ బ్రేక్ దర్శనాలను ఉదయం 7.30 గంటల లోపు పూర్తి చేసి తర్వాత వీలైనంత మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించి తిరిగి 10.15 గంటల నుంచి 11.30 గంటలలోపు శ్రీవాణి, టీటీడీ ప్రస్తుత, రి-టైర్డ్ ఉద్యోగులకు దర్శనం కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇక సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శనాలనూ గురువా రం నుంచి రద్దు చేసిన క్రమంలో ఉదయం గంట, మధ్యాహ్నం గంటన్నర అదనంగా సామాన్య భక్తులకు దర్శన సమయం లభించనుంది.

## రష్యా, ఉత్తర కొరియాల మధ్య ప్రారంభమైన మొదటి రోడ్ లింక్

మొదటిపేజీ తరువాయి...



మాస్కో/ప్యోంగ్యాంగ్ : ఉత్తరకొరియా, రష్యాల మధ్య మొదటి రోడ్ లింక్ కోసం బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించినట్లు ఇరు దేశాల మీడియాలు గురువారం ప్రకటించాయి. ఉత్తర కొరియా ప్రధాని పాక్ థేసాంగ్, రష్యా ప్రధాని మిఖాయిల్‌లు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపాయి. బ్రిడ్జి నిర్మాణం ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత విస్తరించే ఒక ప్రధాన అభివృద్ధి మార్గంగా ఇరు దేశాల ప్రధానులు అభివర్ణించారు. ద్వైపాక్షిక సంబంధాలలో బ్రిడ్జి నిర్మాణం ఒక స్మారక చిహ్నంగా గుర్తుండిపోతుందని పాక్ థేసాంగ్ పేర్కొనగా, రష్యా -ఉత్తర కొరియా సంబంధాలకు ఇది ఒక మైలురాయి మిఖాయిల్ తెలిపారు. కిలోమీటరు పొడవు వుండే ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని ఒకటిన్నర ఏడాదిలోపు పూర్తి చేయాలని అంచనా వేసినట్లు ఇరుదేశాలు ప్రకటించాయి. ఈ బ్రిడ్జి ప్రజల మధ్య దూరాన్ని తగ్గించడంతో పాటు పర్యాటకాన్ని వ్యాప్తి చేస్తుందని తెలిపాయి. ఇరుదేశాలను కలుపుతూ ఇప్పటికే ఒక రైల్వే బ్రిడ్జి, వైమానిక సేవలు కొనసాగుతున్నాయి. రష్యా మరియు చైనాల మధ్య ఉత్తరకొరియా సరిహద్దుల వెంబడి ప్రవహించే తుమెన్ నదిపై ఆటోమొబైల్ కోసం వంతెనను నిర్మించడానికి ఇరు దేశాలు గతేడాది జూన్‌లో అంగీకరించాయి.

## వేవ్స్ సమ్మిట్ ను ప్రారంభించిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి...



నాలుగు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. వేవ్స్ సమ్మిట్ 2025 (కనెక్టింగ్ క్రియేటర్స్, కనెక్టింగ్ కంట్రీస్) తో 100 కి పైగా దేశాల నుంచి కళాకారులు, సృష్టికర్తలు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలను ఒకే గొడుగు కిందకు వచ్చారని మోదీ అన్నారు.. ఈ సమ్మిట్ సృజనాత్మకత కేంద్రంగా అభివర్ణించారు

హాజరైన సినీ ప్రముఖులు..: ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్ , రణ్‌బీర్ కపూర్ , దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్. హేమ మాలిని, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి తదితరుల హాజరయ్యారు. కాగా, 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఇందులో మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు కానున్నారు.

## పహల్గామ్ ఉగ్రదాడిపై పిల్..

మొదటిపేజీ తరువాయి...

**ఢిల్లీ,:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది చాలా క్లిష్టమైన సమయమని, ఇలాంటి సున్నితమైన విషయాల్లో పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్‌పై కొంత అసహనం వ్యక్తం చేసింది. "దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు పౌరులందరూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కలిసి రావాలి. ఇలాంటి వ్యాజ్యాలు వేసే ముందు వాటి సున్నితత్వాన్ని అర్థం చేసుకోవాలి. మీ చర్యల ద్వారా భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? దేశం పట్ల మీకు కూడా బాధ్యత ఉందని గుర్తుంచుకోండి" అని ధర్మాసనం హితవు పలికింది. ఉగ్రవాద దాడుల వంటి అంశాలను న్యాయ సమీక్ష పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నించవద్దని స్పష్టం చేసింది. "ఉగ్రవాద దాడుల ఘటనల విచారణ విషయంలో న్యాయమూర్తులు నిపుణులు కారు. దర్యాప్తు సంస్థలు వాటి పని అవి చేసుకుంటాయి" అని ధర్మాసనం పేర్కొంది. అయితే, తాను ఇతర రాష్ట్రాల్లోని కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే ఈ వ్యాజ్యం దాఖలు చేశానని పిటిషనర్ కోర్టుకు వివరించే ప్రయత్నం చేశారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశమైతే సంబంధిత హైకోర్టులను ఆశ్రయించవచ్చని సూచించింది. సుప్రీంకోర్టు చేసిన సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.

## ఇదీ ఓ గెలుపేనా?: చంద్రబాబుపై జగన్ ఫైర్

**అమరావతి,:** రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్నది రాక్షస పాలన అని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పిఠాపురం, మార్కాపురం, కదిరి (గాండ్లపెంట), కుప్పం (రామకుప్పం) నియోజకవర్గాల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై ఆయన చర్చించారు. ఇటీవల జరిగిన కొన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ వ్యవహరించిన తీరు అప్రజాస్వామికంగా ఉందని జగన్ ఆరోపించారు. మెజారిటీ స్థానాలు వైఎస్సార్సీపీ గెలుచుకున్నా, అధికార దుర్వినియోగం, బెదిరింపులు, డబ్బు ప్రలోభాలతో టీడీపీ పదవులను కైవసం చేసుకుందని విమర్శించారు. "సత్యసాయి జిల్లా గాండ్లపెంటలో ఏడు ఎంపీటీసీలకు ఆరు వైసీపీ గెలిస్తే, బెదిరించి ఎంపీపీ పదవి లాక్కున్నారు. మార్కాపురంలో 15కు 15 మనమే గెలిచినా, సూట్‌కేసు రాజకీయాలతో ప్రలోభపెట్టారు. పిఠాపురం మున్సిపాలిటీలో 30 మందికి 26 మంది మన కౌన్సిలర్లే అయినా, వారిని భయభ్రాంతులకు గురిచేశారు" అని జగన్ ఉదహరించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంలోనూ ఇదే దుస్థితి నెలకొందని ఆయన అన్నారు. "కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులకు 19 వైసీపీ గెలిస్తే, మా కౌన్సిలర్లను బెదిరించి, రూ. 50 లక్షలిచ్చి లాక్కుని ఛైర్మన్ పదవిని దక్కించుకున్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వారే ఇలా చేస్తే ఎలా? బెదిరింపులు, ప్రలోభాలతో గెలిచారు... ఇది గెలుపా?" అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను సైతం టీడీపీ తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని, ఇంతటి ప్రతికూలతలోనూ నిలిచిన కార్యకర్తల ధైర్యాన్ని అభినందిస్తున్నానని తెలిపారు.

## జెరూసలెం శివారు అడవుల్లో భారీ కార్చిచ్చు బీభత్సం

మొదటిపేజీ తరువాయి...

ఈ మంటలను ఆర్పేందుకు 160కి పైగా అగ్నిమాపక బృందాలు, డజన్ల సంఖ్యలో విమానాలు, హెలికాప్టర్లు, సైన్యం కూడా రంగంలోకి దిగాయి. మంటలను అదుపుచేసేందుకు అంతర్జాతీయ సహాయం కోరగా, ఉక్రెయిన్, స్పెయిన్, ఫ్రాన్స్, రొమేనియా, క్రోయేషియా, ఇటలీ వంటి దేశాలు తమ విమానాలను పంపనున్నట్టు ప్రకటించా యి. ఈ ప్రమాదంపై ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పందించారు. ఈ ప్రమాదం కారణంగా జెరూసలెంలో జరగాల్సిన స్వాతంత్ర్య దినోత్స వేడుకలను రద్దు చేస్తున్నట్ల ప్రకటించారు. ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని.. మంటలు నగరంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్చిచ్చుకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# విద్యార్థుల కొరకు వేసవి శిక్షణ శిబిరాలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి01:**వేసవిలో విద్యతో పాటు కళలు, చిత్రలేఖనం, పెయింటింగ్ లతో పాటు శారీరక కార్యకలాపాలలో విద్యార్థులకు శిక్షణ అందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య తో కలిసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో వేసవి శిక్షణ శిబిరం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో కళలు, చిత్రలేఖనం, పెయింటింగ్, క్రీడాంశాలలో ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని, శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. శిక్షణ శిబిరాల నిర్వహణ కొరకు జిల్లాలోని 50 పాఠశాలలు సిద్ధంగా ఉన్నాయని, 15 రోజుల పాటు శిబిరాలు నిర్వహించాలని, ఒక్కొక్క శిబిరానికి 50 వేల రూపాయల నిధులు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి శిబిరంలో 100 మంది విద్యార్థులకు శిక్షణ అందించాలని, ఉపాధ్యాయులు, వాలంటీర్ల ద్వారా గ్రామ పంచాయతీల వారీగా శిబిరాలలో శిక్షణ అందించడం జరుగుతుందని, గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు శిబిరాలకు నాయకత్వం వహించాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు శిక్షణ అందించడం జరుగుతుందని, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు విద్య లో ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు

# అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



**జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిది01:** జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా అధికారులతో నవభారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా 100 శాతం అక్షరాస్యత సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కేంద్ర ప్రయోజిత పథకాలతో ఉల్లాస్ అనేది ఒకటి అని, నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యావకాశం కోల్పోయిన 15 సంవత్సరాలు ఆ పైబడిన నిరక్షరాస్యులకు జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్యతో పాటు డిజిటల్ అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, వృత్తిని నైపుణ్యాలతో నిరంతరం విద్యను అందించడమే లక్ష్యమని తెలిపారు. వయోజనులకు విద్య అందించేందుకు స్వచ్ఛంద బోధకులు అవసరమని, అవగాహనలో చదవడం, రాయడం, అంకెలను గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం వంటివి బోధించడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో చదివే విద్యార్థులు తప్పనిసరిగా ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం, ఉన్నత పాఠశాల విద్య పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ కళాశాలలో చేరే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బడి వయసు గల పిల్లలు ఎవరు బడి బయట ఉండకూడదని, జిల్లాను అక్షరాస్యతలో ముందు వరుసలో ఉండే విధంగా అందరం సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ విద్యాధికారి యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోత్ దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతీరామ్, విద్యాశాఖ అధికారులు ఉదయ్ బాబు, మధుకర్, శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వీసెస్ పరీక్షకొరకు మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి01:** యు.పి.ఎస్.సి – సి.ఎస్ఏ.టి. 2026 (సివిల్ సర్వీసెస్) పరీక్ష కోసం 2025 – 26 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 100 మంది మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీలు) అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్డ్ కేటగిరీలలో వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని తెలిపారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని ప్రొఫెషనల్/ సాధారణ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు ఆన్లైన్ లో %https://cet.cgg.gov.in, www.tmreistelangana.cgg.gov.in% వెబ్ సైట్ ద్వారా ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని, జూన్ 5వ తేదీన జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# రేషన్ బియ్యం విక్రయిస్తే లబ్ధిదారులకు రేషన్ కార్డు రద్దు

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి01:** అర్హులైన నిరుపేద ప్రజలకు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, ఈ బియ్యం విక్రయించిన లబ్ధిదారుల రేషన్ కార్డు రద్దు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. చౌక ధరల దుకాణాల ద్వారా జిల్లాలోని తాండూర్ మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన 11 మంది రేషన్ కార్డుదారులు తాము ప్రభుత్వం ద్వారా పొందిన సన్నబియ్యంను విక్రయించిన సమాచారం మేరకు సంబంధిత లబ్ధిదారుల రేషన్ కార్డులు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. 11 మంది రేషన్ కార్డుదారులు అచలాపూర్ గ్రామానికి చెందిన కుంకుమొట్టి మహేష్ కు బియ్యం విక్రయించిన సమాచారంతో మహేష్ నివాసంలో తనిఖీలు చేయగా సన్నబియ్యం విలువలు లభించాయని, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం సంబంధిత రేషన్ కార్డుదారుల కార్డులను రద్దు చేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదల కోసం చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం విక్రయించినట్లయితే సంబంధిత కార్డులు రద్దు చేయడంతో పాటు కార్డుదారులు, బియ్యం కొనుగోలు చేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

# పదవ తరగతి మండల టాపర్ విద్యార్థులకు సన్మానం

**జననినాదం, కెరమెరి,సిర్పూర్(యు)01:** నిన్న వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని మోడీ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని,(చిన్న సాకడ గ్రామానికి చెందిన) పెందోర్ గీతాంజలి 530 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచింది. అలాగే గ్రామానికి చెందిన మరో విద్యార్థిని ఆడ శిరీష 455 మార్కులతో ఉత్తీర్ణ సాధించారు. ఈ సందర్భంగా గురువారం చిన్న సాకడ గ్రామంలో వారిని ఆదివాసీ సంఘం నాయకులు శాలువాతో సత్కారించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడవి భరత్ భూషణ్, విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు సెద్మకి తుకారాం, నాయకులు పెందోర్ శ్రీనివాస్, సిడం



భీంరావు, కినక సాకారం, ఆడ ఆనంద్, వెంకట్, భుజంగ్, రాంశావు, భీంరావు తదితరులు ఉన్నారు.

## కార్మికుల వ్యతిరేక విధానాలను సహించేది లేదు

# ఘనంగా మేడే దినోత్సవం



జననినాదం,సిర్పూర్(యు), కెరమరి01: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సహించేది లేదని సిఐటియు మండల కన్వీనర్ కూటికల ఆనందరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి మేడే దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ"కార్మికులు తమ హక్కుల సాధనకు కుల, మత, ప్రాంత విభేదాలను పక్కనబెట్టి సంఘటితంగా ఉండాలన్నారు.సమ సమాజ నిర్మాణ స్థాపనే కార్మికోద్యమ లక్షమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను క్రమంగా అమలు చేస్తు కార్మికులకు అన్యాయం చేస్తుంది అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చి, వారి హక్కులను హరించేప్రయత్నం చేస్తుందన్నారు."12 గంటల పని చట్టబద్ధత, కార్మిక సంఘాల ఉనికి మీద ముప్పు, గా ఉందని పేద ప్రజల సంక్షేమానికి కేటాయింపులు తగ్గించడంపై తప్పు పట్టారు. కార్మికుల సమస్యల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్మిక హక్కుల పరిరక్షణకు దేశవ్యాప్తంగా మే 20న కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.ఈ సమ్మె ద్వారా కార్మిక చట్టాల పునరుద్ధరణ, పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ వంటి డిమాండ్లపై పోరాటం కొనసాగుతుందమన్నారు.ఈకార్యక్రమంలో ఐకేపీ విఓఏ యూనియన్ మండల నాయకుడు అనిశెట్టి రమేష్గ్రామపంచాయితీ మండలనాయకులు తీరుసుల్ల సంతోష్ పోర్ల స్వామి మడావి అనిల్,జంగ్ రావు, కుటికెల నగేష్ రాజు శ్రీనివాస్ విజయ్ రాజు వెంకటి మల్లేష్ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.



**జననినాదం,సిర్పూర్(యు)01:**మేడేను పురస్కరించుకుని గురువారం మండలకేంద్రంలోని కార్మికసంఘాల, అంగన్వాడీ ఆధ్వర్యంలో కార్మికులు మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సిఐటీయూ ఆధ్వర్యంలో సిర్పూర్(యు)లోని గాంధీ చౌక్లో ఎర్రజేండా ఎగురువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, తాపి మేస్త్రీ సంఘా నాయుకులు మాట్లాడాతు కార్మికులు పొరాటాల ద్వారానే హక్కును సాధించుకున్నారు. ఆహక్కులను కాపాడుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోని ఆంగన్వాడీ టిచర్ కుర్రం కళాబాయి, జాధవ్ దేవి,ఇస్రుబాయి, సావిత్రిబాయి, తాపీ మేస్త్రీ గేడాం నాగోరావు,తదితరులుపాల్గొన్నారు.

జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు గురువారం సిఐటియు డివెస్ఓ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో మేడే దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షులు సీడం దర్ము, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీఎస్ఓ జిల్లా అధ్యక్షులు వాగ్మారే సంబాజీ మాట్లాడుతూ కార్మికుల హక్కులను నెరవేర్చే విధంగా వారికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు కమల నాయకులు, కార్మికులు, పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**చౌపన్ గూడ లో అవగాహన సదస్సు**


**ఎస్సై ఎన్ మధుకర్**

**జననినాదం,కెరమెరి,సిర్పూర్(యు)01:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎన్, మధుకర్ అన్నారు. గురువారం మండలంలోని చాపను కూడా గ్రామంలో, సైబర్ నేరాలు,100డయాల్, నకిలీ విత్తన విక్రాల విక్రాయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూసోషల్ మీడియా ఎంత వేగంగా విస్తరిస్తున్నదో..అంతే వేగంతో సైబర్ నేరాల ఉచ్చులో యువత పడిపోతున్నారని తెలిపారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్లు వచ్చాయన్నారు. ఇప్పుడు సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ ఉన్నదని, దీనికి రెట్టింపుగా సైబర్ నేరగాళ్ల సంఖ్య కూడా పెరుగుతున్నదన్నారు. ఏదో ఒక లింక్ పంపించి, ఆశ చూపడంతో అమాయక యువత వారి ఉచ్చులో పడి నిలువునా దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. అవగాహనతోనే సైబర్ నేరాలను నివారించే అవకాశం ఉన్నదన్నారు. 100 డయల్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.డయల్ 100 అనేది ఒక అత్యవసర సేవ. ఇది ప్రజలకు పోలీస్ సహాయం అవసరమైనప్పుడు ఉపయోగపడుతుందన్నారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడానికి, సమీపంలోని పోలీస్ స్టేషన్ నుంచి సహాయం అందించడానికి ఇది సహాయపడుసహాయపడుతుందని పేర్కొన్నారు.మీరు ఏదైనా నేరానికి గురైతే.మీరు ప్రమాదంలో ఉంటే లేదా ప్రమాదం జరిగితే,మీరు సహాయం అవసరం అనుకుంటే.మీరు దొంగతనం లేదా ఇతర నేరాలను గమనిస్తే. 100 డయాల్ కు సమాచారం అందించాలన్నారు. అనంతరం గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాము, గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ ఆధ్వర్యం లో ఏస్ఐ రవికుమార్ కి సన్మానం



**జననినాదం,జైనూర్, మే01:** నూతనంగా భాధ్యతలు స్వీకరించిన జైనూర్ ఎస్ ఐ రవికుమార్ కు గురువారం బిజెపి పార్టీ మండల ఆద్యక్షుడు మెశ్రం జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం అని ఏస్ ఐ రవికుమార్ తెలిపారు.శాంతి భద్రతలకు అందరూ సహకరించాలని ఎస్ ఐ రవికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అర్జున్, దిలీప్, రూప్ దేవ్, గోపాల్, సుదర్శన్, నాగోరావు, చందు,జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.




## ధర్మం కోసం ప్రాణాలొడ్డిన ధీర వనిత..

## రాణి యేసుబాయి సాహస గాథ!

చరిత్రలో కొన్ని జీవితాలు అద్భుతంగా నిలిచిపోతాయి. కష్టాల కడలిలో ఓడలా ఒంటరిగా ప్రయాణించినా, తమ విశ్వాసాన్ని వీడని కొందరు ధీరులు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు. అలాంటి ఒక ఉక్కు సంకల్పం కలిగిన వీరనారి రాణి యేసుబాయి భోంస్లే. ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి గొప్ప యోధుడి కోడలు, ధైర్యశాలి శంభాజీ మహారాజ్ భార్య అయిన ఆమె జీవితం సాహసం, ధైర్యం, అచంచలమైన విశ్వాసానికి ప్రతిరూపం. ఏకంగా 29 సంవత్సరాలు మొఘలుల చెరసాలలో నిర్బంధించబడినా, ఆమె తన ధర్మాన్ని విడవకుండా పోరాడిన తీరు అమోఘం. యేసుబాయి ధైర్యం ఆమె పెళ్లితోనే మొదలైంది. మొఘలుల కత్తి ఆమె మెడపై వేలాడుతున్నా, ఆమె శంభాజీ మహారాజ్‌ను వివాహం చేసుకుని తన తెగువను చాటుకున్నారు. ఆ తర్వాత, ఆమె తన భర్త నీడలా అన్ని కష్టాల్లోనూ తోడుగా నిలిచారు. శంభాజీ పాలనలో ఆమె ఒక బలమైన శక్తిగా నిలిచారు. ఆయన తీసుకునే ఎన్నో వ్యూహాత్మక నిర్ణయాలలో ఆమె మాట ఒక దిక్సూచిలా పనిచేసేది. విధి వక్రీకరించడంతో 1689లో శంభాజీ మహారాజ్ మొఘలుల చేతిలో దారుణంగా ప్రాణాలు కోల్పోయారు. ఆ క్షణం నుండి యేసుబాయి ఒంటరి పోరాటం మొదలైంది. తన కుమారుడు శివాజీ రాజారామ్‌తో సహా ఆమె మొఘలుల చీకటి కొటారాలలో ఏకంగా 29 సంవత్సరాలు గడిపారు. ఈ సుదీర్ఘ కాలంలో ఆమె శరీరంపై ఎన్నో గాయాలు, మనసుపై చెప్పలేని వేదన. మతం మారమని మొఘలులు ఆమెను చిత్రహింసలకు గురిచేసినా, ఆమె శిఖరంలా నిలబడ్డారు. ఆమె విశ్వాసం ఒక అజేయమైన కోటలా మొఘలుల ప్రయత్నాలను తిప్పికొట్టింది. చెరసాలలో మగ్గుతున్నా, యేసుబాయి తన మాతృభూమి అయిన మరాఠా సామ్రాజ్యం గురించి క్షణం కూడా మరచిపోలేదు. తన కుమారుడిని ధైర్యవంతుడిగా తీర్చిదిద్దారు. మొఘలుల సంకెళ్ల నుండి విముక్తి పొందిన తర్వాత కూడా ఆమె మరాఠా రాజకీయాల్లో ఒక కీలక శక్తిగా వ్యవహరించారు. రాజారామ్ మహారాజ్ పాలనలో ఆమె ఒక జ్ఞానవంతురాలైన సలహాదారుగా రాజ్యానికి వెన్నెముకలా నిలిచారు. ఆమె చూపిన తెగువ, సహనం, తన ధర్మం పట్ల అంకితభావం రాబోయే తరాలకు ఒక వెలుగులాంటిది. రాణి యేసుబాయి కేవలం ఒక రాణి కాదు, ధైర్యానికి, విశ్వాసానికి, పోరాట పటిమకు ఒక శాశ్వత చిహ్నం. ఆమె జీవితం ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప ప్రేరణ.

# దోస్త్..కు అంతా సిద్ధం




హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ ఇంకా వెలువడలేదు. ఇంటర్ ఫలితాలు వచ్చి వారం రోజులు గడుస్తున్నా దోస్త్ షెడ్యూల్‌పై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలపై సందిగ్ధత నెలకొంది. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దోస్త్ షెడ్యూల్ జారీ చేసేవారు. ఈసారి ఫలితాలు వచ్చి వారం రోజులైనా నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడుతుందో ఉన్నత విద్యామండలి చెప్పలేకపోతుంది. ఈసారి రెండు విడతల్లోనే దోస్త్ ద్వారా ప్రవేశాలు నిర్వహించి జూన్ 16 నుంచి తొలి సెమిస్టర్ తరగతులను ప్రారంభించాలని ప్లాన్ చేసింది. ఇంకా దోస్త్ ప్రకటన వెలువడక పోవడంతో అకగమిక్ ఇయర్ ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తుందిఈసారి దోస్త్‌లో బకెట్ విధానాన్ని తొలగించాలని కొద్దిరోజుల క్రితం ఉన్నతవిద్యామండలి కార్యాలయంలో జరిగిన యూనివర్సిటీ వీసీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. అయితే ఆ నిర్ణయం తీసుకునే అధికారం ఉన్నత విద్యామండలికి గానీ వీసీలకు గానీ లేదు. దీంతో విద్యాశాఖ కస్సున లేచింది. తమకు సమాచారం ఇవ్వకుండా, తమ ఆమోదం లేకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పది రోజుల క్రితం వీసీలతో సమావేశం నిర్వహిం చినా.. ఆ సమావేశానికి సంబంధించి తీర్మానాల కాపీ (మినిట్స్) ఇంతవరకు అందలేదు. దాంతో ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీలో జాప్యం నెలకొంది. ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మొదట ప్రకటిం చిన షెల్యూల్ ప్రకారం ఏప్రిల్ 28న నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావాల్సి ఉండగా దానిని మే 2కు వాయిదా వేశామన్నా రు. మే19 వరకు స్వీకరన ఉంటుందని వెల్లడించారు.

# వ్యాపారం మీది, పెట్టుబడి ప్రభుత్వానిది

నెల్లూరు, : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఎక్కువ దృష్టి పెట్టింది. ప్రతి ఇంటికి వ్యాపారవేత్తలను సిద్ధం చేస్తానంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం ఆ దిశగా చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఆ హామీలో భాగంగా ప్రభుత్వం కొత్తగా ఓ స్కీమ్ తీసుకొచ్చింది. దీని ద్వారా ఔత్సాహికులు సొంతగా వ్యాపారాలు చేసుకోవడమే కాకుండా పది మందికి పని కల్పించేందుకు వీలు అవుతుంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ ద్వారా ఔత్సాహి కులకు లోన్ ఇచ్చే స్కీమ్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందులో లోన్ తీసుకున్న వారంతా వ్యవసాయం, దాని అనుబంధ సంస్థలు, రవాణా, పరిశ్రమలు, సేవల రంగం, వ్యాపార రంగాల్లో నిలదొక్కు కునేలా ప్రయత్నాలు చేయవచ్చు. ఉపాధి పొందడమే కాకుండా తోటి వారికి కూడా పని కల్పించే అద్భుతమైన అవకాశానని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రస్తుతానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మే పదో తేదీ వరకు అప్లై చేసుకోవడానికి గడువు ఇచ్చింది. ఇలా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్ తీసుకొని 32 రకాల వ్యాపారాలు చేసుకోవచ్చు. ఇందులో కొన్నింటికి మినిమం అర్హత పెట్టారు. మరికొన్నింటికి అసలు ఎలాంటి విద్యార్హత లేకుండానే అప్పులు ఇవ్వబోతున్నారు. ఈ స్కీమ్ పొందాలంటే అర్హతలు ఏంటీ? ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే లోన్ పొందాలంటే లబ్ధిదారుడు ఏదైనా కమ్యూనిటీకి చెందినవారై ఉండాలి. కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి. ఏపీకి చెందిన వ్యక్తులే ఈ స్కీమ్‌కు అర్హులు. లబ్ధిదారుడి వయస్సు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన (ఃఖఃఅ) వర్గంలో ఉండాలి. మొదటి లబ్ధిదారుడు వెబ్‌సైట్‌లోకి వెళ్లి ప్రాథమిక వివరాలు నమోదు చేయాలి. అనంతరం యూజర్ ఐడి ఎ పాస్‌వర్డ్ వస్తుంది. యూజర్ ఐడి అంటే రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చిన మొబైల్ నంబర్. పాస్‌వర్డ్ అంటే ఆ నెంబర్‌కు వచ్చే ూఖ దీని ఆధారంగా లాగిన్ అవ్వాలి. అనంతరం రెండో దశలో లబ్ధిదారుడు తన దరఖాస్తు పూర్తి చేయడానికి అడ్రెస్, కులం, విద్యార్హతలు, పథకం వివరాలు పూర్తి చేసి స్కీమ్‌లోకి లాగిన్ అవ్వాలి. అప్లై చేసిన తర్వాత దరఖాస్తుదారుడు అప్లికేషన్ ప్రింట్ తీసుకోవాలి. ఎస్సీ కార్పొరేషన్ మూడు విభాగాల్లో రుణాలు ఇస్తుంది. మొదటి విభాగంలో ఉన్న వారికి రూ.3 లక్షలలోపు పెట్టుబడి వ్యయం యూనిట్లు అందజేస్తారు. రెండో విభాగంలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు వారికి పెట్టుబడి సాయం అందజేస్తారు. మూడో జాబితాలో రూ. పది లక్షలపైన ఆర్థిక సాయం చేస్తారు. మొదటి కేటగిరిలో లబ్ధిదారులకు ప్రభుత్వం 60 శాతం సాయం చేస్తుంది. బ్యాంకులు 35 శాతం రుణం ఇస్తాయి. ఐదు శాతం లబ్ధిదారులు వాటా పెట్టుకోవాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ఈ కేటగిరిలో లక్ష రూపాయల వరకు సబ్సిడీ పొందవచ్చును. రెండో కేటగిరిలో ప్రభుత్వం నుంచి 40 శాతం సాయం అందనుంది. బ్యాంకులు 55 శాతం వరకు రుణాలు ఇస్తాయి. మిగిలిన ఐదు శాతం లబ్ధిదారులు పెట్టుబడి పెట్టుకోవాలి. ఈ కేటగిరిలో ఇచ్చే రాయితీలు ఇతర ఫెసిలిటీసే మూడో కేటగిరికి కూడా వర్తిస్తాయి.

## 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో గంగాధర వివేకానంద విద్యాలయం ప్రభంజనం





చొప్పదండి ని.వ మే 1 : కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయం విద్యార్థులు బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటుగా పలు విద్యార్థులు మంచి ఉత్తమ మార్కులు సాధించారు. కే.వెన్నెల 579/600 ఎం. వర్షిణి 579/600 / పి దీపిక 570/600 ఎల్ జీవనా యకి 565/600, %జు% అక్షయ 565/600 మరియు 500 లకు పైగా 55 మంది సాధించారు. ఈ ఫలితాలపై పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ ,ఉపాధ్యాయుల నిరంతర కృషి, తల్లిదండ్రుల సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రు ల యొక్క సహకారం తమ పాఠశాల మీద ఇలాగే కొనసాగిస్తే రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతమైన విజయాలు సాధించి విద్యార్థుల భవిష్యత్ కు పూల బాటలు వేస్తామని తెలిపారు.


# 33 ఏళ్ల సర్వీస్.. 57 బదిలీలు

**ఐఏఎస్ అధికారి అశోక్ ఖేమ్కా పదవీ విరమణ**
**అవినీతిని సహించని ఉన్నతాధికారిగా హర్యానాలో మంచి పేరు**
**బిజెపి, కాంగ్రెస్ పాలనలో ఆయనపై తరచూ బదిలీ వేటు**



చండీగఢ్ : అవినీతికి వ్యతిరేకంగా నిక్కచ్చిగా వ్యవహరించే అధికారిగా పేరున్న ఐఏఎస్ ఆఫీసర్ అశోక్ ఖేమ్కా పదవీ విరమణ చేశారు. ఈయన హర్యానా క్యాడర్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహరించే ఈయన కెరీర్ మొత్తం బదిలీలతోనే నిండిపోయింది. తన 33 ఏండ్ల సర్వీసులో 57 సార్లు వేర్వేరు పోస్టులకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. దీంతో తన మూడు దశాబ్దాల సర్వీసులో భారత్‌లో అత్యధికంగా బదిలీలు గావించబడిన సివిల్ సర్వెంట్లలో ఒకరిగా అశోక్ ఖేమ్కా నిలిచారు. ఈయన సర్వీసులో సగటున ప్రతి ఏడు నెలలకు ఒకసారి బదిలీ అయ్యారన్నమాట. అశోక్ ఖేమ్కా అవినీతిని సహించని కారణంగా.. ఆయన తాను పని చేసిన విభాగాలలో అవకతవకలను బహిర్గతం చేసి, చర్యలు తీసుకునేవారు. దాని ఫలితంగా రాజకీయ, అధికార సంస్థల నుంచి వచ్చే ఒత్తిళ్ల కారణంగా ఆయన తరచూ పలు పోస్టింగ్‌లకు బదిలీ అయ్యేవారు. కాంగ్రెస్ పాలనలో 21 సార్లు బదిలీ: 2004 నుంచి 2014 మధ్య హర్యానాలోని భూపిందర్‌సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన 21 సార్లు బదిలీ అయ్యారు. ఆ తర్వాత రాష్ట్రంలో మనోహర్‌లాల్ ఖట్టర్ నాయకత్వంలోని బీజేపీ పాలనలోనూ ఇదే పరంపర కొనసాగింది. ఐదేండ్ల పాలనలో ఏడు సార్లు ట్రాన్స్‌ఫర్ అయ్యారు అశోక్ ఖేమ్కా. అవినీతిపై అశోక్ ఖేమ్కా కఠినవైఖరి కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనను తక్కువ ప్రొఫైల్‌గా భావించే విభాగాలకు పంపేవి. దీనిపై అశోక్ ఖేమ్కా ఆందోళన వ్యక్తం చేసేవాడు. పురావస్తు, మ్యూజియంల విభాగానికి 53వ సారి ట్రాన్స్‌ఫర్ అయిన తర్వాత ఎక్స్ (అప్పుడు ట్విట్టర్) వేదికగా 2019లో ఆయన తన అసంతృప్తిని, బాధను వెలిబుచ్చారు. "నిజాయితీకి ప్రతిఫలం అవమానం" అని రాసుకొచ్చారు. అశోక్ ఖేమ్కాను ప్రభుత్వాలు తరచుగా ఆర్కైవ్స్, పురావస్తు, ప్రింటింగ్, స్టేషనరీ వంటి తక్కువ స్థాయిగా భావించే విభాగాలకు బదిలీలు చేసేవి. 2022 అక్టోబరులో హర్యానా ప్రభుత్వం ఇతరులను కార్యదర్శి స్థాయికి పదోన్నతిని కల్పిస్తూ.. అశోక్ ఖేమ్కాను మాత్రం విస్మరించింది. ఆ సమయంలో దీనిపై ఆయన ఎక్స్ వేదికగా తన ఆవేదనను, నిరాశను వెలిబుచ్చారు. అశోక్ ఖేమ్కా 57వ బదిలీ గతేడాది డిసెంబర్‌లో జరిగింది. ఆ సమయంలో ఆయన రవాణా శాఖ అదనపు కార్యదర్శిగా నియమితులయ్యారు. తన పదవీవిరమణకు కేవలం నాలుగు నెలల సమయం ముందు ఆయనకు ఈ పోస్టింగ్ వచ్చింది. ఎవరు ఈ అశోక్ ఖేమ్కా?: ఈయన పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఏప్రిల్ 30, 1965న ఒక సాధారణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి శంకర్‌లాల్ ఖేమ్కా ఒక జ్యూట్ మిల్లులో అకౌంటెం ట్‌గా పని చేశారు. ఆయన 1988లో ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీ.టెక్ చేశారు. ఆ తర్వాత ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్‌లో ప్రత్యేకత కలిగిన ఎంబీఏ డిగ్రీని, ఆర్థిక శాస్త్రంలో ఎంఏ డిగ్రీని, అలాగే పంజాబ్ యూనివర్సిటీ నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ లా డిగ్రీ (2016-19 మధ్య)ని పొందారు. ఆ ఒప్పందం రద్దుతో జాతీయస్థాయిలో ఆయనపేరు: 2012లో హర్యానా భూసమీకరణ మరియు హోల్డింగ్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా అశోక్ ఖేమ్కా వ్యవహరించారు. ఆ సమయంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు సంబంధించిన స్కైలైట్ హాస్పిటాలిటీకీ, గురుగ్రామ్‌లోని మనేసర్-షికోపూర్‌లోని రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్ఎఫ్‌కి మధ్య జరిగిన 3.5 ఎకరాల భూ ఒప్పందాన్ని రద్దు చేయటంతో ఖేమ్కా పేరు జాతీయస్థాయిలో పెద్ద ఎత్తున వినబడింది. ఆ తర్వాత ఖేమ్కా బదిలీ అయ్యారు.

# కోట్లు కొల్లగొట్టి సేవా కార్యక్రమాలు చేస్తున్న 'మంచి దొంగ'



**300కు పైగా కేసుల్లో నిందితుడైన శివప్రసాద్ అరెస్ట్**
**చోరీ చేసిన సొమ్ముతో సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు**
**ఆలయాలకు విరాళాలు, పేదల ఆస్పత్రి ఖర్చులకు సహాయం**

కర్ణాటకలో వందల కొద్దీ దొంగతనాలకు పాల్పడిన ఓ గజదొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు వెల్లడించిన విషయాలు పోలీసులనే ఆశ్చర్యానికి గురిచేశాయి. చోరీ చేసిన సొమ్ముతో భారీ ఎత్తున సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తేలడం గమనార్హం. ఈ వింత దొంగ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కర్ణాటకకు చెందిన శివప్రసాద్ అలియాస్ మంత్రి శంకర్‌పై 300కు పైగా దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. ఎట్టకేలకు అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడి నుంచి సుమారు రూ. 30 లక్షల విలువ చేసే 412 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు శివప్రసాద్ కోట్ల రూపాయల విలువైన సొత్తును అపహరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అయితే, విచారణలో వెలుగులోకి వచ్చిన మరో కీలక విషయం పోలీసులను నివ్వెరపరిచింది. శివప్రసాద్ తాను దొంగిలించిన డబ్బులో గణనీయమైన భాగాన్ని సేవా కార్యక్రమాలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నట్లు తెలిపాడు. ఇలా దానధర్మాలు చేయడం ద్వారా తాను చేసిన పాపాలకు ప్రక్షాళన జరుగుతుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పాడు. ముఖ్యంగా తాళాలు వేసి ఉన్న సంపన్నుల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడని విచారణలో వెల్లడైంది. ఆధారాలు దొరక్కుండా, వేలిముద్రలు పడకుండా ఉండేందుకు శివప్రసాద్ ఓ వినూత్న పద్ధతిని అనుసరించేవాడని పోలీసులు గుర్తించారు. చేతి వేళ్లకు ఫెవికాల్ పూసుకుని చోరీలు చేయడమే అతని ప్రత్యేకత అని వివరించారు. తాను దోచుకున్న సొమ్ములోంచి మహారాష్ట్రలోని ఓ ప్రముఖ ఆలయ నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం అందించినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, పలు దేవాలయాలకు బంగారు కానుకలు సమర్పించడం, పేదల ఆసుపత్రి ఖర్చులను భరించడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు విచారణలో తేలింది.

# చట్ట సవరణలు చేస్తున్న చట్టసభలు



**ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి**
**భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు**

భీమవరం(పశ్చిమగోదావరి) : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక కర్షకులతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి చట్టాలు చేయాల్సిన చట్టసభలు చట్ట సవరణలు చేసే చట్ట సభలుగా మారాయని ఉభయగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్ర గోపి మూర్తి విమర్శించారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో మే డే, పుచ్చలపల్లి సుందరయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపి మూర్తి కార్మిక జెండాను ఆవిష్కరించి సుందరయ్యకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు యు టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవి రామభద్రం అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ గోపి మూర్తి మాట్లాడారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు కర్షకులు పోరాటాల ద్వారానే చట్టాలు హక్కులు సాధించుకున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ చట్టాలను హక్కులను సవరణలు, రద్దు చేస్తున్నారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం ప్రస్తుత కోటమే ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యాసంస్థల వల్ల ప్రభుత్వ విద్య రంగం నిర్వీర్యం అవుతుందని చెప్పారు. యాక్టు 20 20 తీసుకురావడం వల్ల హక్కులను కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటుందని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అవుతూనే కార్మిక శ్రామిక వర్గానికి ఉపయోగమని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకో వాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. యుటిఎఫ్ నాయకులు పట్టాభి రామయ్య , రాజ్ కుమార్, జ్ఞాన వేదిక నాయకులు చింతపల్లి ప్రసాద్, మల్లుల శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహిళా కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్

కరీంనగర్ మే 01: నగరంలోని ముప్పై అయిదవ డివిజన్ శ్రీనగర్ కాలనీలో మహిళా సమాఖ్య భవనానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక మాజీ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి మహిళా సమాఖ్య సభ్యుల కోరిక మేరకు సుడా నిధులు పది లక్షలు మంజూరు చేసి ఈరోజు పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి,నేతికుంట యాదయ్య,సరిల్ల ప్రసాద్, పిట్టల శ్రీనివాస్,డిఈ రాజేంద్ర ప్రసాద్,ఏఈ సతీష్, మహిళా సమైఖ్య సంఘం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి,ఆర్పి విజయ కాలనీ వాసులు పాల్గొన్నారు.



## అల్వాల్ లో మేడే వేడుకలు

సికింద్రాబాద్: అల్వాల్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు 139 వ ప్రపంచ కార్మికులకు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.అల్వాల్ మున్సిపల కార్యాలయం ముందు, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించి మేడే వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాపాడుకునే అవసరం ఉందని అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫార్వర్డ్ చేసే విధంగా పోరాడాలని శ్రమజీవుల శ్రమ గుర్తించే విధంగా కనీస వేతనం పెంచే విధంగా కార్మికులు శుభ్రం చేసే కనీస సౌకర్యాలు చెప్పులు గాని బూట్లు గాని అవసరాలు కూడా సరైన సమయానికి ఇవ్వలేక నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని కార్మిక నాయకులు వాపోయారు. అంతేకాకుండా ఎన్ని కార్మిక సంఘాలు పుట్టుకొచ్చిన ప్రభుత్వం మాత్రం మొండి చేయి చూపుతుందని తెలిపారు.

## విద్యార్థులను సన్మానించిన కొత్తపల్లి ఎంఈఓ




కొత్తపెల్లి మండలం మే 01: పదవ తరగతి ఫలితాలలో వికాస్ హై స్కూల్ ఇ/మీ విద్యార్థుల 100% ఉత్తీర్ణత ఏప్రిల్ 30 వికాస్ హై స్కూల్ పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కొత్తపల్లి ఎంఈఓవిద్యార్థులను సన్మానించిన కొత్తపల్లి ఎంఈఓ పదవ తరగతి ఫలితాలలో వికాస్ హై స్కూల్ ఇ/మీ విద్యార్థుల 100% ఉత్తీర్ణత ఏప్రిల్ 30 వికాస్ హై స్కూల్ పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కొత్తపల్లి ఎంఈఓ సన్మానించారు. తేజస్ బెహరా -565, డి. రుచిత-532, ఆర్ .సంజన-530, డి సాయి వరుణ్-529, కె .వీర-528, కే. ధృతిక-525, బి. అశ్విత-524, ఇ. వాసవి-521, యన్. నితీశ-520, జె. రశ్మిత-520, ప్రదీప్-510, కె. రమ్య-508, డి.హర్షవర్ధన్-500, 13 మందికి పైగా 500 మార్కులు సాధించడమే కాకుండా, 100% ఉత్తీర్ణత సాధించినట్లు వికాస్ హై స్కూల్ చైర్మన్ రాచమల్ల శారద శ్రీనివాస్ తెలిపారు. ఒక్కొక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఒక పటిష్టమైన ప్రణాళికతో నిరంతరం వివిధ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నధం చేయడం మూలంగానే అద్భుత ఫలితాలను సాధించడం సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రిన్సిపల్ శారద శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సన్మానిం చారు. తేజస్ బెహరా -565, డి. రుచిత-532, ఆర్ .సంజన-530, డి సాయి వరుణ్-529, కె .వీర-528, కే. ధృతిక-525, బి. అశ్విత-524, ఇ. వాసవి-521, యన్. నితీశ-520, జె. రశ్మిత-520,ప్రదీప్-510, కె.రమ్య-508,డి.హర్షవర్ధన్-500,

13 మంది కి పైగా 500 మార్కులు సాధించడమే కాకుండా, 100% ఉత్తీర్ణత సాధించినట్లు వికాస్ హై స్కూల్ చైర్మన్ రాచమల్ల శారద శ్రీనివాస్ తెలిపారు. ఒక్కొక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఒక పటిష్టమైన ప్రణాళికతో నిరంతరం వివిధ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నధం చేయడం మూలంగానే ఈరోజు అద్భుత ఫలితాలను సాధించడం సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రిన్సిపల్ శారద శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పది రోజుల క్రితం మరణించిన బాలిక..

## పదో తరగతిలో స్కూల్ టాపర్



సిరిసిల్ల: కష్టపడి చదివింది. పది ఫలితాల్లో స్కూల్ ఫస్ట్ వచ్చింది. అయితే ఆమెను విధి వెక్కిరించింది. ఆ ఆనందాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి ఆమెను లేకుండా చేసింది. ఎందుకంటే పరీక్షలు పూర్తయిన 13 రోజులకు ఆమె అనంత లోకాలకు వెళ్లింది. ఈ విషాద ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకున్నది. జిల్లాలోని బోయినపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల నాగచైతన్య అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగిన పరీక్షలను ఉత్సాహంగా రాసింది. అయితే అంతలోనే ఏమైందో ఏమో అనారోగ్యానికి గురైంది. పరిస్థితి విషమించడంతో ఏప్రిల్ 17న మరనించింది. అయితే బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 510 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్‌గా నిలిచింది. విషయం తెలుసుకుని బాలిక తల్లిదండ్రులు కన్నీటిపర్యంతం అయ్యారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లోనూ బాలికలే సత్తా చాటారు. బాలికలు 94.26 శాతంతో ప్రతిభ కనబరచగా, బాలురు 91.32 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో మొత్తంగా 92.78 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. నిరుడు 91.31 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులవగా ఈ సారి 1.47 శాతం ఉత్తీర్ణత పెరిగింది. పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలను బుధవారం రవీంద్రభారతిలో సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. మహబూబాబాద్ జిల్లా 99.29శాతంతో మొదటిస్థానంలో నిలిచింది. సంగారెడ్డి 99.09శాతంతో రెండోస్థానంలో, జనగామ 98.91శాతంతో మూడోస్థానంలో నిలిచింది. జిల్లా పరిషత్ స్కూళ్లల్లో 89.13 శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 84.83 శాతం, ఎయిడెడ్‌లో 90.65% విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేట్ బడుల్లో 94.21శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఈసారి పదో తరగతి మెమోలపై మార్కులతోపాటు గ్రేడ్లను సైతం ముద్రించారు. ఇంటర్నల్ మార్కులు, థియరీ పరీక్షల్లో వచ్చిన మార్కులను కలిపి మొత్తం మార్కులు వేశారు. సీజీపీఏ గ్రేడ్లను సైతం కేటాయించారు. జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు ఈ నెల 16లోపు ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.

## కార్మికులహక్కుల సాధనకు సమరశీల పోరాటం చేయాలి

**సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు**

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పురమల శ్రీనివాస్**



**కరీంనగర్,** చికాగో వీధుల్లో కార్మిక వర్గం చిందించిన నెత్తుటి చారికలు నేటికీ స్ఫూర్తిదాయకమని, పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం వంటి హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి కార్మికులపై ఉందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ఉద్ఘాటించారు. మే డే సందర్భంగా బొమ్మకల్ గ్రామంలో కాల్వ నరసయ్య యాదవ్ చిత్రపటం వద్ద జరిగిన మే డే వేడుకలో అరుణపతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పైడిపల్లి రాజు మాట్లాడుతూ, అప్పటి దుర్మార్గపు ప్రభుత్వం కార్మికుల గొంతు నొక్కాలని ప్రయత్నించినా, వారి ఐక్య పోరాటం ముందు తలవంచక తప్పలేదని గుర్తు చేశారు. న్యాయమైన వేతనాలు, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు, జీతంతో కూడిన సెలవులు, మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు, కార్మిక సంక్షేమ చట్టాలు వంటి ఎన్నో విజయాలు ఆ పోరాటాల ఫలితమేనని ఆయన అన్నారు.నేడు పరిస్థితులు మళ్లీ మారుతున్నాయని, పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మిక వర్గం మరింత ఐక్యంగా, సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు.సమానత్వం కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్క కార్మికుడు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథి కాంగ్రెస్ పార్టీ లికరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జి పురమళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మతోన్మాద బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మికుల హక్కులను హరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఆటో రిక్షా, హమాలి కార్మికుల నుండి మొదలుకొని అడ్డా కూలీల వరకు ప్రతి ఒక్క కార్మికుడు "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే చారిత్రాత్మక నినాదంతో స్ఫూర్తి పొంది, సమానత్వం కోసం, తమ హక్కుల కోసం ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్మిక శక్తికి తిరుగులేదని నిరూపించే సమయం ఆసన్నమైందని పురమళ్ళ శ్రీనివాస్ అన్నారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో బొమ్మకల్ సిపిఐ గ్రామ కార్యదర్శి కాల్వ శ్రీనివాస్ యాదవ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, హమాలి నాయకులు మేకల చంద్రయ్య, రాయమల్లు,పాశం మోహన్, గాలిపెల్లి సుధాకర్, మాదరవేణి సంపత్, పెంటమీద ఐలయ్య, పుట్టపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**సింగరేణి ప్రవేటికరణకు వ్యతిరేకంగా కార్మికవర్గామంతా పోరాడాలి**

**కార్మిక వర్గానికి మేడే శుభాకాంక్షలు**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్.**





రామగుండం :కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మేడలు వంచాలని, సింగరేణి ప్రవేటికరణకు వ్యతిరేకంగా కార్మికవర్గామంతా పోరాడాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మేడేకార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక వర్గానికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. స్దానిక 2 ఇంక్లయిన్ వద్ద ఎర్ర జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సింగరేణి సంస్దను ప్రైవేటిపరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని కార్మికలోకమంతా ఒక్కటై పోరాడిల్సిన సమయం వచ్చిందన్నారు.పోరాడితే పోయ్యేది ఎమిలేదు బానిస సంకెళ్లు తప్ప అన్న నినాదంతో చికాగో వీరుల స్పూర్తిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి లో కేసీఆర్ అమలు చేసిన జివోలు అమలు పర్చకుండా కార్మికులను ఇబ్బందులు పెడుతున్నరన్నారు. కేంద్రం ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 20 తేదిన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. చారిత్రాత్మక మేడే స్పూర్తితో, బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కార్మిక హక్కుల కోసం అడుగడుగునా నిలిచింది. సింగరేణి శ్రామికులకు బోనస్‌లు, ఉద్యోగ భద్రత, మెరుగైన సౌకర్యాలతో గౌరవించామని గుర్తు చేశారు. కేసీఆర్ గారి పాలనలో టీఎస్ఆర్టీసీ కార్మికులకు జీత భత్యాల పెంపు, ఆరోగ్య బీమా వంటి సంక్షేమ పథకాలతో భరోసా కల్పించామని ఆటో డ్రైవర్లు, అసంఘటిత కార్మికులకు ఆర్థిక సహాయం, సంక్షేమ బోర్డులతో అండగా నిలిచామని చెప్పారు. ఈ కార్యక్రమం లో టి.బి.జి.కె.ఎస్, బి.ఆర్ఎస్ పార్టీ నాయకులు వడ్డెపల్లి శంకర్ నారాయణదాసు మారుతి, రామరాజు కొడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు



కమాన్ పూర్ మే 1: మే డే సందర్భంగా రామగిరి మండల భవన నిర్మాణ కార్మికుల కార్యాలయము నందు మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సమైక్య సంఘం (బి.ఎన్.కే.ఎస్.ఎస్) జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి ఉద్యమ పథకాన్ని ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భవననిర్మాణకార్మికులు సాధించవల సిన సమస్యలు చాలా ఉన్నాయి. వాటి కోసం నిరంతరం కార్మికులంద రం ఐకమత్యంగా పోరాడవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఎనిమిది గంటల పని దినం కోసం గతంలో శ్రామికు లు పోరాడిన దానికి చిహ్నంగానే మనం మే డే జరుపుకుంటున్నామ న్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎస్కే షరీఫ్, కుసుమ సురేష్, కొయ్యడ సంపత్, వెంగళ రాములు, జంగిలి తిరుపతి, తన్నీరు విష్ణువర్ధన్, ప్రభాకర్, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## చింతలపూడినుంచి అమరావతికి యాభై బస్సులు

ఏలూరు: .అమరావతి పునర్నిర్మాణం కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజక వర్గం నుండి 50 బస్ లు కార్ లు ఏర్పాటు చెసామని అన్నారు. చింతలపూడి నియోజక వర్గం నుంచి 4000 మందికి పైగా నుంచి వస్తున్నారు. సభకు వచ్చేనవారికి ఉదయం టీ టిఫిన్ మధ్యానం భోజనం ఏర్పాటు చేసారు. ఎండ లు ఎక్కువ వున్నందున ఓఆర్ఎస్, మజ్జిగ పాకెట్స్, బస్సుకు ఒక ఏఎన్ఎం అందుబాటులో వుంటారు అని తెలిపారు, కార్యకకర్తలు, నాయకులు అధికారులు కార్య క్రమం ని విజయవంతం చేయాలని కోరారు

## కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సహాయం

### వెలుగు సామాజిక సంస్థ



రామగుండం : గోదావరిఖని గౌతమ్ నగర్ లో నివాసం ఉంటున్నా నిరుపేద కుటుంబానికి చెందిన మల్లమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మల్లవ్వకు వెలుగు సామాజిక స్వచ్ఛ సంస్థ ఆధ్వర్యంలో, గడవేన సదానంద సునీత దంపతుల పెళ్లి రోజు సందర్భంగా 25 కేజీల రైస్ బ్యాగ్ ఇవ్వడం జరిగింది. అనంతరం వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటూ కొన్ని నెలల నుండి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వైద్యం చేపించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న మల్లవ్వకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోసదానందం సునీత పెళ్లిరోజు సందర్భంగా వారి వంతు సహాయం గా 25 కేజీల రైస్ బ్యాగ్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు.దాతలు ఇంకాఎవరైనా ఉంటేమల్లవ్వకు వైద్య ఖర్చులకో సం సహాయ సహకారాలు అందించాలని సురభి శ్రీధర్ దాతలను కోరారు.ఈ కార్యక్రమంలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు లయన్ డాక్టర్,వేముల రమేష్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు డాక్టర్ తూము నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా మేడే

మంథని ప్రతినిధి, మే 01: మంథని కోర్టు ప్రాంగణంలో మే డే ను మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సంద్భంగా సీనియర్ సివిల్ జడ్జీ వి. భవాని మాట్లాడుతూ కార్మికుల హక్కుల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థ పై ఉన్నందున అవగాహన కార్యక్రమం




ఏర్పాటుచేసినట్టు తెలిపారు,ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ కీర్తి సింహ, ద్వితీయ శ్రేణి న్యాయ మూర్తి బి. అనురాద,బార్ అసోషియేషన్ అధ్యక్షులు కర్నె హరిబాబు, ఉపాధ్యక్షులు రఘోత్తం రెడ్డి,ప్రధాన కార్యదర్శి సహేందర్ రెడ్డి,ఎపిపి సందీప్,ఎజీపి బి.ఆంజనేయులు,సహాయ కార్మిక సంక్షేమ అధికారి రవీందర్, న్యాయవాదులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు

## ఖన్సాయిపేట పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం



మంథని ప్రతినిధి,మే 01: జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్య చరణ ఫలితంగా ఎఫ్ ఎల్ ఎన్ లో మంచి ఫలితాలు సాధించడంతో దాని కొనసాగింపుగా ప్రభుత్వ పాఠశాలలో వేసవి సెలవులలో సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు.వలంటర్స్ ద్వారా విద్యార్థులకు ఆట పాటలతో సులభంగా విద్యను నేర్పించడం జరుగుతుంది. మంథని మండలం లోని ఆరెంద కాంప్లెక్స్ లోని ఖన్సాయిపేట పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు ఎం శ్రీనివాస్ సమ్మర్ క్యాంప్ ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి సెలవులలో ఆరెంద కాంప్లెక్స్ లోని ఖానాపూర్, బట్టుపల్లి, అడవి సోమనపల్లి నాగపల్లి,వేంకటాపూర్,ఆరెంద పాఠశాల పరిధిలోని అందరూ విద్యార్థులు వినియోగించుకోవాలని తల్లిద్రందు లకు తెలియజేశారు. ఈ కార్యక్రమములో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేందర్,సిఆర్పి మల్లన్న,వాలంటర్స్వరూపలు పాల్గొన్నారు.

## బీసీ సంఘాల సంబురాలు

హైదరాబాద్: జనాభా లెక్కల్లో కులగణన చేయాలన్న కేంద్ర నిర్ణయంపై... పలు బీసీ సంఘాలు హైదరాబాద్ లో సంబరాలు చేశాయి. ఆలిండియా ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో హైదర్ గూడ కూడలి లో ఉన్న జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీసీ ఆజాద్ ఐకాస చైర్మన్ బత్తుల సిద్దేశ్వర పటేల్, ఢిల్లీ లో 22 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతిఫలం దక్కిందని ఆళ్ల రామకృష్ణ అన్నారు. దశాబ్దాల నిరీక్షణ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జాతి గణనలో కుల గణన చేస్తామని ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా వేగవంతం చేయాలని మోదీకి విజ్ఞప్తి చేశారు.

## ఆర్థికంగా మహిళలకు అండగా ఉండేందుకే..

# ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

**నాలుగు గ్రామాల చిరకాల వాంఛను తీర్చిన ప్రభుత్వ విప్**

**రాములపల్లి ఎక్స్ రోడ్ వద్ద ఆర్టీసీ బస్సును ప్రారంభించిన లక్ష్మణ్ కుమార్**







పెగడపల్లి ధర్మపురి మే 01 : ఆర్థికంగా మహిళలకు అండగా ఉండేందుకే తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని రాములపల్లి, నంచర్ల, దీకొండ, వెంగలాయిపేట గ్రామాల నుండి పెగడపల్లి మోడల్ స్కూల్ వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును జగిత్యాల డిపో ఆర్టీసీ అధికారులు, పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా ప్రారంభించారు. రాములపల్లి, నంచర్ల, దీకొండ, వెంగలాయిపేట గ్రామాల నుండి జగిత్యాలకు వెళ్లడానికి కొన్ని సంవత్సరాల నుండి బస్సు సౌకర్యం లేకపోవడంతో బస్సు సౌకర్యం కల్పించాలని ఈ నాలుగు గ్రామాల ప్రజలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకురాగా, ప్రభుత్వ విప్ ప్రత్యేక చొరవ చూపించి ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జగిత్యాల డిపో ఆర్టీసీ అధికారులు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును గురువారం విప్ లక్ష్మణ్ కుమార్ జిల్లా అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మండల నాయకులు, అధికారులతో కలసి స్వయంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడి, నాలుగు గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యాన్ని వినియోగించు కోవాలని కోరారు.అనంతరం లక్ష్మం కుమార్ మాట్లాడుతూ... ముం దుగా అందరికీ మేడే శు భాకాంక్షలు తెలియజేస్తున్నానని, జగిత్యాల నుండి రాములపల్లి, నంచర్ల, దీకొండ, వెంగళాయిపేట, పెగడపల్లి గ్రామాల వరకు నడపనున్న నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించి నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న పాలకులకు ఈ గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. బస్సు సౌకర్యం కావాలని నా దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో, టీజీఎస్ఆర్టిసి కరీంనగర్ రీజనల్ మేనేజర్‌తో, జగిత్యాలడిపో మేనేజర్‌తో మాట్లాడి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి, బస్సును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ గ్రామాల ప్రజలు అందరూ ఈ బస్సును వినియోగించుకొని, ప్రయాణి ంచాలని కోరారు. రాములపల్లి గ్రామంలోని వీధులలో మురికి నీటి కాలువ లేక వర్షాలు కురిసే సమయంలోఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరు తుందని మహిళలు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ కు తెలియజేయగా, వెంటనే లక్ష్మణ్ కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్ కల్పన, ఎంఎఫ్ కవిత, పెగడపల్లి మండల ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, నందగిరి పిఎసిఎస్ చైర్మన్ కర్ర భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు సంధి మల్లారెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు చాట్ల విజయభాస్కర్, చెట్ల కిషన్, శ్రీరాం అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి తిరుపతి, ఇస్లావత్ రవి నాయక్, అమిరిశెట్టి మల్లారెడ్డి, ఎడ్ల శ్యామ్ సుందర్ రెడ్డి, దీకొండ మహేందర్, నీరటి రాజేందర్, కొత్త శ్రీనివాస్, నీరటి రాజ్ కుమార్, పుల్కం జలపతి, బుర్ర తిరుపతి గౌడ్, తౌటు గంగాధర్, తడగొండ తిరుపతి, కుంచె రాజేందర్, ఆర్టీసీ సిబ్బంది రవీందర్ రావు, పాష, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో 139 వ మేడే దినోత్సవం..



కమాన్ పూర్ మే 1: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా కమాన్ పూర్ మండల కేంద్రంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ.. మే డే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతమని అనేకమంది కార్మికుల బలిదానాల ఫలితంగానే ఎనిమిది గంటల పని విధానం చట్టం వచ్చిందని కార్మికుల సంక్షేమం కోసం చట్టాలు ఆవిర్భవించాయని అన్నారు.కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 12 గంటల పని విధానాన్ని తీసుకురావాలని లేబర్ కోడ్స్ ను రూపొందించిందని అన్నారు.దీనిని కార్మిక వర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు 29 కార్మిక చట్టాన్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుందని కార్మిక వ్యతిరేకమైనదని అన్నారు. మేడే స్ఫూర్తితో మే 20 తారీకున జరిగే దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.... ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ టి కృష్ణకుమారి డి జయసుధ (అంగన్వాడి యూనియన్) ఎం కృష్ణవేణి (ఆశ వర్కర్) శారద , అంజలి, రాధా, కుమారి ,సరోజన, మనీ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు...

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం పై నిషేధాజ్ఞలు కోనసాగింపు..

**అనుమతి లేని డ్రోన్,డిజె సౌండ్స్ పై చర్యలు**

**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో**

**సిటీ పోలీస్ యాక్ట్ అమలు**

**పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**



గోదావరిఖని : సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని తెలపడం జరిగింది. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమి దని, మద్యం ప్రియులు ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01-05-2025 నుండి 01-06-2025 వరకుకొనసా గుతాయని తెలిపారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. (భారతియ న్యాయ సంహిత) బి ఎన్ ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.డీజే ,డ్రోన్ లపై నిషేధాజ్ఞలు పొడగింపు: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో డీజే సౌండ్ ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగించమని అని సిపి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. చిన్నపిల్లలు వృద్ధులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్ లతో కూడిన డిజె సౌండ్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధించారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్ల వినియోగిస్తున్నారని అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి ల అనుమతి పొందాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు ఏ స్థాయిలో మైక్ సెట్ లో వినియోగించాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు 01-05-2025 నుండి 01-06-2025 వరకు కొనసాగుతాయని తెలిపారు పరిస్థితుల ప్రభావం ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. (భారతియ న్యాయ సంహిత) బి ఎన్ ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు: రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ల పరిధిలో రామగుండం పోలీస్ కమిషనరేట్ 7 (1), 2016, యాక్ట్, 22 (1) (%ఝ% )నుండి (ఫ్ ) మరియు 22 (2) (%ఝ) ు% ( బి), %ు% 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 నో %×శ% ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం తేది ల01-05-2025 ఉదయం 6:00 నుండి 01-06- 2025 ఉదయం 6 గంటల వరకు ఆమలులో వుంటుంది. అని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటన లో తెలిపారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. పైన పేర్కొన్న కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి, బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము. మరియు శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

# సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు



వియవాడ, : ఏపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేల సంఖ్యలో అనర్హులను గుర్తిస్తున్నారు. వికలాంగుల పెన్షన్లలో ఇప్పటి వరకు 65వేల మంది అనర్హులను గుర్తించారు. పెన్షన్ల తనిఖీ పూర్తయ్యేనాటికి ఈ సంఖ్య మరింత పెరుగనుంది.ఏపీలో సామాజిక పెన్షన్ల తనిఖీలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అనర్హులకు పెన్షన్లు చెల్లిస్తున్నారని ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ఏపీ ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ల తనిఖీ చేపట్టింది. వికలాంగులకు రూ.6 వేల నుంచి రూ.15వేల వరకు పెన్షన్లు చెల్లిస్తుం డటంతో పెద్ద ఎత్తున అనర్హులు వాటిని దక్కించుకుంటున్నారు. ఏపీప్రభుత్వం అందిస్తోన్న సామాజిక పెన్షన్లను తప్పుడు ధృవీకరణ పత్రాలతో పొందుతున్నవారి డొంక కదులుతోంది. గత మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సామాజిక పెన్షన్లను వైద్య బృందాలతో తనిఖీ చేయిస్తోంది. ఈ క్రమంలో బోగస్ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందుతున్న వారిని పెద్ద సంఖ్యలో గుర్తించారు.ఏపీలో నెలకు రూ.6 వేలు నుంచి రూ.15వేల వరకు సామాజిక పెన్షన్లను చెల్లిస్తు న్నారు. ఈ క్రమంలో తొలిదశలో రూ.15వేల పెన్షన్లు పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించి వాటిని తొలగించారు.రెండో దశలో మార్చి నుంచి రూ.6 వేల పెన్షన్ పొందుతున్న వారికి క్షేత్ర స్థాయి పరీక్షలు నిర్వహించిన అనర్హులను తొల గిస్తున్నారు. శారీరక వైకల్యంలో భాగంగా అయిదు విభా?గాల్లో ప్రతి నెల 8లక్షల మందికి రూ.6 వేల పెన్షన్ చెల్లిస్తున్నారు.ఈ ఏడాది ఫిబ్ర వరి నుంచి ఆరోగ్య శాఖ, సెర్ప్ అధికారుల బృందాలు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. లబ్దిదారులను ఎంపిక చేసిన ఆసుపత్రులలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది.మొత్తం పెన్షనర్లలో 4లక్షల మంది ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారున్నారు. మిగిలిన వారిలో ఈఎన్టీ, కంటి చూపు లోపం, మానసిక వైకల్యం ఇతర సమస్యలున్న వారున్నారు.ఇప్పటి వరకు 3 లక్షల మందికి వైద్య పరీక్షలు పూర్తి చేయగా వారిలో సుమారు 65 వేల మంది అనర్హులను గుర్తించారు. పది వేల మందికి వైకల్యం ఉన్నా.. పెన్షన్ పొందే స్థాయిలో శారీరక వైకల్యం లేదు.శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలో అనర్హులుఅధికంగా ఉన్నట్లు గుర్తించారు. నెల్లూరు, అనంత పురం, కర్నూలు, తిరు పతి జిల్లాల్లో అనర్హులు పట్టుబడుతున్నారు.అంగవైకల్యం, మానసిక, ఈఎన్టీ సమస్యలున్న వారికి నవంబర్ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నెలకు రూ.15 వేల పెన్షన్ పొందే 24,091 మందిలో 7,256 మంది అనర్హులలను గతంలోనే గుర్తించారు. మిగిలిన 70% లో 31.29% మంది రూ.6వేల పెన్షన్‌కు మాత్రమే అర్హత ఉంది.తక్కువ వైకల్యం ఉన్న వారికి 40శాతానికి పైగా వైకల్యంగా నమోదు చేయడంతో వారికి రూ.6వేల పెన్షన్ లభిస్తోంది.

## విద్యార్థినులను అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు



కమాన్ పూర్ మే 1: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండల స్థాయి ర్యాంకులు సాధించిన రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు పాగాల రసిత(558) శ్రీమంతుల లోహిత(557)లను ఐటి పరిశ్రమలు అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంథనిలో గురువారం అభినందించారు.విద్యార్థినులు ఎంపిక చేసుకున్న కళాశాలలో చదివిస్తానని ఉన్నత విద్యనభ్యసించడానికి బలహీనవర్గాల పిల్లలకి ఎల్లప్పుడూ అండదండగా నిలుస్తానని భరోసా పేర్కొన్నారు.ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని బడుగు బలహీన వర్గాల పిల్లలు ఉన్నత స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం ధృఢ సంకల్పంతో పనిచేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు.

## అత్యుత్తమ ఫలితాలు సాధించిన గోపాల్ రావు పేట ఆల్ఫోర్స్



రామడుగు: రాష్ట్ర విద్యాశాఖ బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో రామడుగు మండలం గోపాలరావుపేట ఆల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి తెలిపారు. 500కు పైన 72 మంది విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ఆల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు కీర్తిని తెచ్చిపెట్టారు. పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను బక్క శెట్టి హర్షిని 574 కే భాను ప్రకాష్ 573 ఎం శరణ్య 568 జె. సాయి చరణ్ 568 కే సంజన జి మాన్విత 566 మార్కులు సాధించారని పాఠశాల చైర్మన్ వి నరేందర్ రెడ్డి తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ వి నరేందర్ రెడ్డి శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.


## క్రీడల వల్ల వ్యక్తిత్వ వికాసం పెరుగుతుంది....

**ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య**

కమాన్ పూర్ ప్రజా క్రాంతి మే 1.వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ %ు% గేమ్స్ అసోసియేషన్ సింగరేణి సంస్థ ఆర్జీ 2 ఏరియా వారి ఆద్వర్యంలో డా. ఏపిజె అబ్దుల్ కలామ్ స్టేడియం నందు ఉచిత వేసవి క్రీడా శిభిరాన్ని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. వేసవి సెలవులలో ఏదైనా క్రీడలో నైపుణ్యత సాధించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికే కాక శారీరక ధ్రుడత్వానికి వ్యక్తిత్వ వికాసం కూడా ఉపయోగ పడుతుందని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య అన్నారు. సింగరేణి ఉద్యోగుల మరియు పరిసర ప్రాంత నివసించే పిల్లలకు వాలీబాల్, ఫుట్ బాల్ మరియు బాస్కెట్ బాల్ లో 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, డీజిఎం పర్సనల్, అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డీజీఎం ఐఈ మురళీకృష్ణ, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్, స్పోర్ట్సుఅనారబుల్ సెక్రెటరీ, డివైపిఎం వేణుగోపాల్, స్పోర్ట్స్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కొఆడినేటర్ పోశం, జనరల్ క్యాప్టన్ సంతోష్ మరియు క్రీడకారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానం..

**బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్**



కమాన్ పూర్ మే 1: రక్తదానం ప్రాణదానం అని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు.

గురువారం మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని రామగిరి మండలం సెంటినరీ కాలనీ ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేయగా తిరుపతి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిందం మహేష్, కండె పోశం, జనగామ కృష్ణ గెల్లు కుమార్ గుండం రవితేజ గాజుల వెంకటేష్ రామిండ్ల మనోహర్ తీగల సమ్మయ్య కొలిపాక సారయ్య మట్ట రాజ్ కుమార్ పున్నం శ్రీనివాస్ గౌడ్ తదితరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మిగిలాలని అన్నారు. ఆపద సమయంలో రక్తదానం చేస్తే వారి ప్రాణాన్ని కాపాడి ఆ కుటుంబానికి చేయూతగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంటినరీ కాలనీ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటా సత్యం, అంబిరి శ్రీనివాస్ పటేల్, సత్రం సమ్మయ్య, తోపాటు పలువురు పాల్గొన్నారు.

## పేద వర్గాల అభ్యున్నతికి సూపర్ సిక్స్ పథకాలు అమలు

**గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

గుడివాడ: పేదల ముఖంలో నవ్వు చూడాలని, వారి ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కించాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.గుడివాడ పట్టణంలోని 23,24 వార్డుల్లో ఎమ్మెల్యే రాము గురువారం ఉదయం ప్రభుత్వ పింఛన్లు పంపిణీ చేశారు.వార్డుల్లోని లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి ఆయన భార్య సుఖదతో కలిసి పింఛన్ మొత్తాన్ని అందించారు. అదేవిధంగా వారి సంక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగులకు ఆర్థిక భరోసా ఉండేలా పింఛన్లను పెంచినట్లు, ఆ మొత్తాన్ని సకాలంలో వారికి అందించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, టిడిపి నాయకులు పంద్రాజు సాంబయ్య, పొట్లూరి కృష్ణారావు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


# మంచు విష్ణుకి సారీ చెప్పిన శ్రీ విష్ణు




టాలీవుడ్ యంగ్ హీరో శ్రీ విష్ణు ప్రధాన పాత్రలో సింగిల్ అనే మూవీ రూపొందుతుంది. కామెడీ, లవ్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రూపొందుతుంది.. శ్రీవిష్ణు , వెన్నెల కిశోర్ కామెడీ టైమింగ్, పంచ్ డైలాగ్స్‌తో ట్రైలర్‌లో నవ్వులు పూయించారు. అయితే, కామెడీ ట్రాక్‌లో సాగే కొన్ని డైలాగ్స్ ఇప్పుడు వివాదాస్పదం అయ్యాయి. ట్రైలర్‌లో.. శ్రీవిష్ణు 'శివయ్యా..' అని అరుస్తూ ఉండడంపై విష్ణు అసంతృప్తిగా ఉన్నారనే టాక్ వినిపించింది. అందుకు కారణం మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప టీజర్‌లో ఆయన శివయ్య అని గట్టిగా అరిచారు. దానిపై తెగ ట్రోలింగ్ నడిచింది. ఇప్పుడు దానిని బేస్ చేసుకొనే సింగిల్' ట్రైలర్‌లోనూ శ్రీ విష్ణు 'శివయ్యా' అంటూ వెటకారం చేసేలా అరవడం , ట్రైలర్ చివర్లో 'మంచు కురిసిపోతుందని' అంటూ శ్రీవిష్ణు డైలాగ్ చెప్పడంపై కూడా విష్ణు ఆగ్రహంతో ఉన్నారని కామెంట్స్ వినిపించాయి. వీటిపై డైరెక్టర్స్ అసోసియేషన్‌లోనూ కంప్లైంట్ చేస్తారనే రూమర్స్ వినిపించాయి. అయితే సింగిల్ ట్రైలర్ విడుదల సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్‌లో ఈ విషయంపై విలేకరులు ప్రశ్నించగా, హీరో శ్రీ విష్ణు స్పందిస్తూ.. కన్నప్ప డైలాగ్ ఒక్కటే కాదని మరికొంతమంది హీరోలు, సినిమాల ప్రస్తావన కూడా సినిమాలో ఉంటుందని తెలిపారు. మేము ఎవరినీ బాధపెట్టాలని చేయలేదని అన్నారు. వివాదం మరింత ముదురుతున్న నేపథ్యంలో శ్రీవిష్ణు ఓ వీడియో విడుదల చేశారు. కన్నప్ప టీమ్ మేము వాడిన డైలాగ్స్ కి హర్ట్ అయ్యారని తెలిసింది. అది కావాలని చేసింది కాదు. తప్పుగా కన్వే కావడంతో వెంటనే మేము స్పందించి ఆ డైలాగ్స్ తీసేస్తున్నాము. ఆ డైలాగ్స్ సినిమాలో కూడా ఉండవు. హర్ట్ చేద్దామనే ఉద్దేశం అయితే లేదు. ప్రజెంట్ జనరేషన్ వాడే సినిమా రిఫరెన్స్ లు, మీమ్స్ సినిమాలో ఎక్కువగా ఉన్నాయి. ఆ ప్రాసెస్ లోనే చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, అల్లు అరవింద్ గార్ల డైలాగ్స్ కూడా వాడాము. ఒక పాజిటివ్ గానే కామెడిగానే ఇవన్నీ చేసాము. అలాంటివి మీకు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే సారీ. అలాంటివి ఎక్కువ రాకుండా చూసుకుంటాము. ఏమైనా ఇబ్బంది పెడితే సారీ. ఇండస్ట్రీ అంతా ఒకటే. హర్ట్ అయిన వాళ్లందరికీ సారీ అంటూ చెప్పుకొచ్చాడు. దీంతో ఈ వీడియో వైరల్ గా మారింది.

## ఆస్కార్ అవార్డ్ అందుకున్న తొలి భారతీయుడు,సినీ దర్శకుడు, భారతరత్న సత్యజిత్ రే

### –నేడు ఆయన జయంతి



ఆస్కార్ అవార్డ్ అందుకున్న తొలి భారతీయుడు సత్యజిత్ రాయ్ భారతదేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. ఆతను ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించాడు. కలకత్తాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో మే 2,1921 న జన్మించిన సత్యజిత్ రాయ్ కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలోనూ, రవీంద్రనాథ్ టాగోర్ స్థాపించిన శాంతినికేతన్ లోని విశ్వభారతి విద్యాలయము లోనూ చదివాడు. వ్యాపార కళాకారునిగా కెరీర్ ప్రారంభించిన రాయ్, లండన్ లో ఫ్రెంచి నిర్మాత జాన్ రెన్వాను కలిసాక, ఇటాలియన్ "నియోరియలిస్టు" సినిమా బైసికిల్ థీవ్స్ తరువాత సినిమాలు తీయడంపై ఆసక్తి పెంచుకున్నాడు.రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. ఆయనకి దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉంది. తన సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే (కథాగమనము), కేస్టింగ్ (నట సారథ్యము), సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము – వంటివి కూడా ఆయనే చూసుకునేవాడు. సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక "సందేశ్"ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నాడు. 1992లో, అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (ఆస్కార్) సత్యజిత్ రాయ్కి అకాడమీ గౌరవ పురస్కారం (ఆస్కార్ అవార్డు) అందించారు. గౌరవ ఆస్కార్ పురస్కాన్ని అందుకున్న తొలి భారతీయునిగానూ, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగప్రముఖునిగానూ నిలిచారు. తాను మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, తన చలనచిత్ర జీవితంలో ఇది అత్యంత గొప్ప విజయంగా ప్రకటించారు.ఏప్రిల్ 23 1992 కొలకత్తా లో మరణించాడు.


# 'తుడరం' బాక్సాఫీస్ రికార్డు



మలయాళ చిత్రం 'తుడరం' అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకుం టూ బాక్సాఫీసు వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మోహన్‌లాల్ కెరీర్‌లోనే అత్యధిక వసూళు చేసిన సినిమాగా రికార్డుకెక్కింది. ఈ సినిమాలో మోహన్‌లాల్, శోభన జంటగా నటిం చారు. ఎం.రంజిత్ నిర్మాత, తరుణ్‌మూర్తి దర్శకత్వం వహించారు. ప్రకాశ్‌వర్మ, బిను పప్పు, భారతీరాజా, థామస్ మ్యాథ్యూ, సంగీత్ ప్రతాప్, అర్ష చాందిని బైజూ తదితరులు నటించారు. రాజపుత్ర విజువల్ మీడియా బ్యానర్‌పై రూపొందించిన ఈ సినిమా ఏప్రిల్ 25న విడుదలైంది. అప్పటి నుంచి నేటి వరకూ థియేటర్లు పూర్తి ఆక్యుపెన్సీని నమోదు చేస్తున్నాయి. కేరళతోపాటుగాకర్నాటక, ఆంధ్రా, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఈ సినిమా విజయవం తంగా ప్రదర్శితమవుతోంది. ఓవర్సీస్‌లో భారీగా ఆదరణ లభిస్తోంది.




# రజనీకాంత్ సలహా పాటిస్తున్నా!



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తరహాలోనే వెంకటేష్‌లో కూడా ఆధ్యాత్మిక భావాలు ఎక్కువగా కనిపిస్తాయి. తాజాగా తమిళ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రజనీకాంత్‌తో తనకున్న అనుబంధం, ఆయనిచ్చిన ఓ సలహా గురించి ఆసక్తికరమైన విషయా లను పంచుకున్నారు వెంకటేష్. కెరీర్ తొలినాళ్లలో రజనీకాంత్ ఇచ్చిన సలహాను ఇప్పటివరకు పాటిస్తున్నానని తెలిపారు. 'రజనీకాంత్ మా నాన్నతో కలిసి పనిచేశారు. మా కుటుంబంతో మంచి అనుబంధం ఉంది. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఆయనో మాట చెప్పారు. 'సినిమా రిలీజ్ ఎంత గ్రాండ్‌గా చేశారు? పెద్ద బ్యానర్లు కట్టారా? మ్యాగజైన్స్ ఫ్రంట్ పేజీల్లో మన ఫొటోలు వేశారా? వంటి విషయాల గురించి అస్సలు ఆలోచించొద్దు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మన పని మనం చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడే జీవితంలో ప్రశాంతంగా ఉంటాం' అని సూచించారు. ఆ సలహాను ఇప్పటికీ పాటిస్తున్నా. పబ్లిసిటీ, కలెక్షన్స్ వంటి విషయాల గురించి నేను అస్సలు పట్టించుకోను' అని వెంకటేష్ అన్నారు. తాను దైవాన్ని పరిపూర్ణంగా విశ్వసిస్తానని, ఎన్నో ఆధ్యాత్మిక పుస్తకాలు చదివానని, అరుణాచలం సందర్శనను ఎంతగానో ఇష్టపడతానని, రమణ మహర్షిని ఆరాధిస్తానని వెంకటేష్ చెప్పారు.


# పాకిస్థాన్ నటుల ఇన్‌స్టా అకౌంట్లపై భారత్ బ్యాన్..





న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలో ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న దాయాదికి తగిన బుద్ధి చెప్పేందుకు భారత్ సిద్ధమైంది. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ దేశాన్ని అన్నివైపుల నుంచి దిగ్బంధించేలా చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా సింధూ నది జలాలను ఆపేసిన ఇండియా.. మన దేశం మీదుగా పాక్ విమానాలు వెళ్లేందుకు వీల్లేదని తేల్చిచెప్పింది. ఆ దేశ ప్రభుత్వం, ఆర్మీకి చెందిన సామాజిక మాధ్యమాలపై ఇప్పటికే నిషేధం విధించింది. అదేవిధంగా మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా సున్నితమైన కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న 16 పాక్ యూట్యూబ్ చానళ్లను బ్యాన్ చేసింది. పలువురి ట్విట్టర్ అకౌంట్లపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. భారత్ నుంచి పాకిస్థాన్‌కు ఎగుమతి అవుతున్న ఔషధాలు, ఫార్మా ఉత్పత్తులకు కూడా కోతపెట్టనుంది. అదేవిధంగా ఎలక్ట్రానిక్స్, ఈ–కామర్స్ వస్తువుల ఎగుమతిపై కూడా ఆంక్షలు విధించేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. మరోవైపు పాకిస్థానీ నటులైన మహీరా ఖాన్, హనియా ఆమిర్, అలీ జఫర్, సనమ్ సయీద్ సహా అనేక మంది ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను బ్లాక్ చేసింది. అలీ జాఫర్, సనమ్ సయీద్, బిలాల్ అబ్బాస్, ఇక్రా అజీజ్, ఇమ్రాన్ అబ్బాస్, సాజల్ అలీ వంటి పాకిస్థానీ సెలబ్రెటీల ఇన్‌స్టాగ్రావ్ు అకౌంట్లు భారత్‌లో కనిపించకుండాపోయాయి. 'అకౌంట్ నాట్ అవైలబుల్ ఇన్ ఇండియా' అని ఆయా అకౌంట్లలో దర్శనమిస్తున్నా యి. అయితే ఫవద్‌ఖాన్, వాహజ్ అలీ వంటి పలువురు ప్రముఖ పాక్ నటుల ఇన్‌స్టా అకౌంట్లు ఇప్పటికీ భారత్‌లో యాక్టివ్‌గానే ఉండటం గమనార్హం. కాగా, భారత్ నిషేధించిన యూట్యూబ్ చానళ్లలో డాన్, సమా టీవీ, ఆరే న్యూస్, బోల్ న్యూస్, రఫ్తార్, జియో న్యూస్, సునో న్యూస్, ది పాకిస్థాన్ రిఫరెన్స్,సమా స్పోర్ట్స్, ఉజైర్ క్రికెట్, రాజీ నామా ఉన్నాయి. అలాగే ఇర్షాద్ భట్టి, అస్మా షిరాజీ, ఉమర్ చీమా, మునీబ్ ఫరూక్ అనే నలుగురు జర్నలిస్ట్‌ల పేర్లను ఈ జాబితాలో చేర్చింది.

## తల్లిదండ్రులు కాబోతున్న లావణ్య త్రిపాఠి, వరుణ్ తేజ్..?



టాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ తేజ్, నటి లావణ్య త్రిపాఠి దంపతులకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ జంట త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నారంటూ నెట్టింట విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. గతేడాది ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట గురించి వస్తున్న ఈ వార్త మెగా అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. లావణ్య తల్లి కాబోతుండటంతో మెగా కుటుంబ సభ్యులు సంతోషంగా ఉన్నారని కథనాలు వస్తున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందనే దానిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. త్వరలోనే మెగా కుటుంబం ఈ శుభవార్తను అధికారికంగా ప్రకటిస్తుందని కూడా కొందరు చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ వరుణ్, లావణ్య దంపతులకు మెగాఫ్యాన్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మరోవైపు వరుణ్ తేజ్ కెరీర్ విషయానికొస్తే, 2023లో ఆయన నటించిన 'గాండీవధారి అర్జున', గతేడాది వచ్చిన 'ఆపరేషన్ వాలెంటైన్', 'మట్కా' చిత్రాలు ఆశించిన విజయాన్ని సాధించలేకపోయాయి. ప్రస్తుతం ఆయన దర్శకుడు మేర్లపాక గాంధీతో కలిసి VT–15' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem
(Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.